# జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక






సంపుటి :12 సంచిక :328 శుక్రవారం 31-7-2026 పేజీలు:8 వెల:3

https://www.epaperjournalistdiary.com/




## న్యాయస్థానాలపై గౌరవం ఉంది

- ఉపముఖ్యమంత్రిగా ఉన్నా కోర్టుకు హాజరయ్యా
- నాడు బాధితులకు అండగా నిలిస్తే బిఆర్ఎస్ కక్షసాధింపు కేసులు..
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్

న్యాయస్థానాలు, చట్టం పట్ల తమకున్న అపారమైన గౌరవాన్ని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చాటుకున్నారు. నాటి కొత్తగూడెం బిఆర్ఎస్ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కుమారుడు వనమా రాఘవేంద్రరావు (రాఘవ) వేధింపుల కారణంగా నాగ రామకృష్ణ కుటుంబ ఆత్మహత్యాయత్నం ఘటనలో తీవ్రంగా గాయపడిన చిన్నారి సాహితీని కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శ సమయంలో కోవిడ్ నిబంధనలు ఉల్లంఘించారంటూ నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం నమోదు చేసిన కేసులో ఆయన గురువారం నాంపల్లిలోని స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టుకు (ఎక్సైజ్ కేసెస్) విచారణ నిమిత్తం స్వయంగా హాజరయ్యారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి హోదాలో ఉండి కూడా ఒక సాధారణ పౌరుడిలా ఆయన కోర్టుకు హాజరు కావడం అందరినీ ఆకర్షించింది. వివరాల్లోకి వెళ్తే.. పాత పాల్వంచకు చెందిన మీసేవ కేంద్ర నిర్వాహకుడు నాగ రామకృష్ణ (45) కుటుంబంలో తల్లి, సోదరితో ఉన్న

-మిగతా 2 లో

## ఉపాధ్యాయులదే భావితరం

# బాధ్యత

**నాణ్యమైన విద్యకోసం ఏం చేయాలో మీరే చెప్పండి**

- ఒక్కో విద్యార్థిపై రూ.1.8 లక్షలు ఖర్చు చేస్తున్నా
- తల్లిదండ్రులు ఎందుకు ప్రయివేటుకు పంపుతున్నారో ఆలోచించండి
- టీచర్ల సమస్యలు పరిష్కరించే బాధ్యత నాదే
- ఫిన్‌లాండ్, జర్మనీ దేశాల్లో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయ బృందంతో సీఎం రేవంత్ రెడ్డి ముఖాముఖి

హైదరాబాద్

దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందనీ, దాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని సీఎం ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. వారిద్దరి బాధ్యతను తానే స్వయంగా తీసుకుంటానన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామనీ, అదే సమయంలో ఉపాధ్యాయ సంఘాలు వారి కోసం కాకుండా విద్యార్థుల కోసం పోరాడాలని సూచించారు. గత ప్రభుత్వంలో ఏనాడూ 1వ తేదీ జీతాలివ్వలేదని గుర్తు చేశారు. ఆ పరిస్థితిని తాము మార్చామన్నారు. ప్రభుత్వం కోసం పని చేసే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలివ్వకపోతే అది పాలకుల వైఫల్యమేనని గుర్తించి, సరిదిద్దామని తెలిపారు.

-మిగతా 2లో





## ఇండియాపై డ్రాగన్ గురి

- సరిహద్దుల్లో 12 జెట్‌లను మోహరించిన చైనా
- ఉపగ్రహ చిత్రాల్లో వెల్లడి

2లో



## జాతీయ గేయాన్ని అవమానిస్తే మూడేండ్ల జైలు..

- వందేమాతరం బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

2 లో



2 లో

## అమెరికా బేస్‌లపై క్షిపణులతో ఇరాన్ దాడి

- జోర్డాన్‌లో 8,000 మైళ్ల వేగంతో దూసుకొచ్చే క్షిపణుల దాడులు
- దూసుకొచ్చిన 5 క్షిపణులను గాల్లోనే కూల్చివేసిన జోర్డాన్ సైన్యం
- ఇరాన్‌పై భీకర దాడికి దిగుతామని ట్రంప్ హెచ్చరిక


## మెటాకు కేంద్రం సమన్లు

- వారం రోజుల్లో హాజరు కావాలని ఆదేశం
- ప్రధాని మోదీ వీడియో తొలగింపు ఘటనపై కేంద్రం సీరియస్
- విధానపరమైన, సాంకేతిక అంశాలపై వివరణ ఇవ్వాలని సూచన
- జులై 28 నుంచి ప్రముఖుల ఖాతాలకు కొత్త ప్రోటోకాల్స్ అమలు చేస్తున్నామని మెటా వెల్లడి

2లో

ప్రధాని మోదీ వీడియో తొలగింపు వ్యవహారం దేశవ్యాప్తంగా కలకలం రేపిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మెటాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు ఈ సాంకేతిక లోపం ఎలా జరిగింది? మళ్లీ ఇలాంటి ఘటనలు జరగకుండా ఏ చర్యలు తీసుకుంటున్నారు? అనే అంశాలపై మెటా ఉన్నతాధికారులను 10 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని కేంద్రం ఆదేశించడం ఈ వ్యవహారానికి మరింత ప్రాధాన్యం తీసుకొచ్చింది.



## లీకు మాఫియాను వదిలేది లేదు

- కఠినమైన చట్టాలు అవసరం
- టెక్నాలజీతో సంస్కరణలు
- ఫాస్ట్ ట్రాక్ చర్యలు
- ఈ చట్టం ఒక మైలురాయి
- బిల్లు ఆమోదం పొందిన తరువాత ప్రధాని కొత్త ఇన్స్టాగ్రామ్ వీడియో

న్యూఢిల్లీ:

యాంటీ - పేపర్ లీక్ బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందడాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ స్వాగతించారు. దీనిని ఆయన ఒక ప్రధాన పరీక్షా సంస్కరణగా అభివర్ణించారు. పేపర్ లీక్ మాఫియాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన ప్రతిజ్ఞ చేశారు. ఈ చట్టం విద్యార్థుల భవిష్యత్తును కాపాడుతుందని అన్నారు. అలాగే, టెక్నాలజీ, బలమైన చట్టపరమైన రక్షణలను ఉపయోగించి సంస్కరణలు కొనసాగుతాయని ఆయన నొక్కి చెప్పారు.

ఉభయ సభలు బిల్లును ఆమోదించిన తర్వాత ఇన్స్టాగ్రామ్లో పంచుకున్న వీడియోలో మోడీ మాట్లాడుతూ దీనిని భారతదేశ పరీక్షా వ్యవస్థను సంస్కరించడంలో ఒక ప్రధాన ముందడుగుగా అభివర్ణిస్తూ, పేపర్ లీక్ రాకెట్లలో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. వరుస రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు దశాబ్దాలుగా పేపర్ లీక్ల సవాలుతో పోరాడుతున్నాయని, దీనివల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని అన్నారు. పరీక్షల ప్రక్రియను బలపేతం చేయడానికి, వ్యవస్థలో మార్పులు, వేగవంతమైన యంత్రాంగాలు,

-మిగతా 2లో



## వర్షాల నేపథ్యంలో ముందస్తు చర్యలు

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- రెవెన్యూ , విపత్తు నిర్వహణ అధికారులతో టెలికాన్ఫరెన్స్
- అన్ని శాఖలూ సమన్వయం చేసుకోవాలంటూ ఆదేశాలు

హైదరాబాద్

భారీ వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, విపత్తు నిర్వహణ అధికారులతో మంత్రి గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో రెవెన్యూ యంత్రాంగం పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖలతో సమన్వయం చేసుకుని నిరంతరం క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. వాగులు, వంకలు, చెరువులు, జలాశయాల వద్ద ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల్లోని

-మిగతా 2 లో

**అంగన్‌వాడీల్లో మౌలిక వసతుల కల్పనకు**

# పెద్దపీట


- రాష్ట్రంలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో వంద శాతం మౌలిక వసతులు కల్పించాలి
- ఏ మాత్రం జాప్యం లేకుండా అన్ని జిల్లాల్లో అంగన్‌వాడీ చిన్నారులకు పాలు, బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు చేయాలి
- అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో జిల్లాల వారీగా సదస్సులు నిర్వహించాలి
- అధికారులను ఆదేశించిన మంత్రి సీతక్క

హైదరాబాద్

అంగన్‌వాడీ కేంద్రాల్లో గత ఏడాది కాలంలోనే అదనంగా 5,938 కేంద్రాలకు టాయిలెట్ సదుపాయం, 3,815 కేంద్రాలకు తాగునీటి సదుపాయం, 14,271 కేంద్రాలకు విద్యుత్ సదుపాయం కల్పించినందుకు అధికారులు, సిబ్బందిని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క అభినందించారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కేంద్రాలకు కనీస మౌలిక వసతులు కూడా పూర్తిస్థాయిలో అందలేదని పేర్కొన్న మంత్రి.. రాష్ట్రంలోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో వంద శాతం టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నేడు సచివాలయంలో మహిళా శిశుసంక్షేమ శాఖపై మంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. శాఖ కార్యదర్శి శృతి ఓజా, జాయింట్ డైరెక్టర్ మోతి తదితర అధికారులు

-మిగతా 2 లో





## అఫ్ఘానిస్థాన్‌లో వధువు మేకప్‌పైనా నిషేధం

- అఫ్ఘానిస్థాన్‌లో వధువు మేకప్‌పైనా నిషేధం

కాబూల్

అఫ్ఘానిస్థాన్‌లో మహిళలపై అనేక ఆంక్షల్ని విధిస్తున్న అక్కడి తాలిబన్ సర్కార్..వధువుపైనా కఠిన నిబంధనల్ని ప్రకటించింది. వివాహ సమయంలో వధువు మేకప్ వేసుకోవటాన్ని కూడా నిషేధించింది. నిశ్చితార్థం, వివాహ వేడుకలు ఇకపై ఇస్లామిక్ నిబంధనల ప్రకారం ఉండాలంటూ తాలిబన్లు తాజాగా ఓ డిక్రీ విడుదల చేశారు.వివాహ సమయాల్లో వధువు మేకప్

-మిగతా 2లో

# న్యాయస్థానాలపై గౌరవం ఉంది

(మొదటి తరువాయి)



ఆస్తి వివాదాన్ని పరిష్కరించే నెపంతో "నా భార్య శ్రీలక్ష్మి (40)ని తన వద్దకు పంపాలని రాఘవ కోరినట్లు" రామకృష్ణ ఆత్మహత్యకు ముందు విడుదల చేసిన సూసైడ్ సెల్ఫీ వీడియోలో కన్నీటిపర్యంతమయ్యారు. మానప్రాణాలకు భంగం వాటిల్లడంతో వేరే మార్గం లేక రామకృష్ణ 2022 జనవరి 3 అర్ధరాత్రి దాటిన తర్వాత భార్య శ్రీలక్ష్మి, కవల కుమార్తెలు సాహిత్య (13), సాహితీ (13)లపై పెట్రోల్ పోసి, గ్యాస్ లీక్ చేసి నిప్పు అంటించారు. ఈ ఘటనలో రామకృష్ణ, శ్రీలక్ష్మి, సాహిత్య అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చిన్నారి సాహితీ కూడా మరణించింది. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న రామకృష్ణ కుమార్తె సాహితీని పరామర్శించేందుకు నాటి సీఎల్పీ నేతగా ఉన్న మల్లు భట్టి విక్రమార్క భద్రాచలం ఎమ్మెల్యే పొడెం వీరయ్య, కాంగ్రెస్ నేత ఎడవెల్లి కృష్ణ కలిసి 2022 జనవరి 04న వెళ్లారు. అయితే, ఆ సమయంలో కరోనా నిబంధనలు ఉల్లంఘించారంటూ బందోబస్తు విధులు నిర్వహించిన బ్లాక్‌క్యాట్ కానిస్టేబుల్ నాగేశ్వర్ రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తగూడెం టౌన్ పోలీసులు విక్రమార్క సహా పలువురు కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదు చేశారు. ఈ విచారణలో భాగంగానే డిప్యూటీ సీఎం నిన్న నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు.

# ఇండియాపై డ్రాగన్ గురి

**-సరిహద్దుల్లో 12 జెట్‌లను మోహరించిన చైనా**
**-ఉపగ్రహ చిత్రాల్లో వెల్లడి**



న్యూఢిల్లీ:
భారత సరిహద్దుకు ఎదురుగా ఉన్న రెండు వైమానిక స్థావరాలలో చైనా తన అత్యంత ఆధునికమైన కనీసం 12 జె-20 స్టీల్త్ ఫైటర్ జెట్‌లను మోహరించినట్లు వాణిజ్య ఉపగ్రహ చిత్రాలు వెల్లడించాయి. ఇటీవల సంవత్సరాలలో వాస్తవ నియంత్రణ రేఖ (ఎల్ఏసీ) వెంబడి ఐదవ తరం విమానాల అతిపెద్ద మోహరింపులలో ఇది కూడా ఒకటిగా నిలుస్తుందని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. వాణిజ్య ఉపగ్రహ సంస్థ వాంటోవర్ తీసిన ఈ చిత్రాలు జిన్‌జియాంగ్‌లోని హోటాన్ వైమానిక స్థావరం, టిబెట్‌లోని దామ్‌క్షుంగ్ వైమానిక స్థావరం వద్ద పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ ఎయిర్ ఫోర్స్ (పీఎల్ఏఏఎఫ్) ఈ యుద్ధ విమానాలను మోహరిస్తున్నట్లు చూపిస్తున్నాయి. చిత్రాల ప్రకారం జూలై 9న హోటాన్ వైమానిక స్థావరం వద్ద ఎనిమిది జె-20 మైట్ డ్రాగన్ స్టీల్త్ యుద్ధ విమానాలు టార్మాక్‌పై నిలిపి ఉంచినట్లు కనిపించాయి. చైనాలోని జిన్‌జియాంగ్ ఉయ్ఘుర్ ఆటోనమస్ ప్రాంతంలోని హోటాన్ వైమానిక స్థావరం ఉత్తర లడఖ్‌లోని దౌలత్ బేగ్ ఓల్డీ వద్ద ఉన్న భారత వైమానిక దళ ఫార్వర్డ్ ఎయిర్ బేస్ నుండి సుమారు 245 కిలోమీటర్లు, లేహ్ నుండి దాదాపు 389 కిలోమీటర్ల దూరంలో ఉంది. జూన్ 25 నాటి వేరొక ఉపగ్రహ చిత్రాల ప్రకారం టిబెట్‌లోని లాసా సమీపంలోని దామ్‌క్షుంగ్ వైమానిక స్థావరం వద్ద మరో నాలుగు జె-20 విమానాలు మోహరించి ఉన్నట్లు కనిపించాయి. దామ్‌క్షుంగ్ అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్‌కు వాయువ్యంగా సుమారు 344 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ రెండు ప్రదేశాలలో కలిపి సుమారు రెండు వారాల వ్యవధిలో కనీసం 12 జె-20 స్టీల్త్ ఫైటర్లను ఫోటోలు తీయడం జరిగింది. దీంతో ఇటీవల సంవత్సరాలలో భారతదేశానికి ఎదురుగా ఉన్న చైనా వైమానిక స్థావరాలలో గమనించిన అతిపెద్ద మోహరింపులలో ఇది ఒకటిగా పరిగణించబడుతోంది. భారత్‌కు సమీపంలో ఉన్న ఎత్తయిన వైమానిక స్థావరాలలో జె-20 విమానాలు పదేపదే కనిపించడం, ఏదో ఒక నిర్దిష్ట సంఘటనకు సంబంధించిన తాత్కాలిక చర్య కాదని, సరిహద్దు వెంబడి చైనా సైనిక వైఖరిలో ఇటువంటి మోహరింపులు భాగంగా మారుతున్నాయి.

# జాతీయ గేయాన్ని అవమానిస్తే మూడేండ్ల జైలు..

**వందేమాతరం బిల్లుకు పార్లమెంట్ ఆమోదం**



**న్యూఢిల్లీ, జూలై 30**
జాతీయ గేయం వందేమాతరాన్ని అవమానించడాన్ని నేరంగా పరిగణించే బిల్లుకు గురువారం పార్లమెంట్ ఆమోదం తెలిపింది. స్వల్ప చర్చ తర్వాత గందరగోళం మధ్య లోక్‌సభ ఈ చట్టాన్ని ఆమోదించింది. దేశ గౌరవానికి అవమానాలను నిరోధించే (సవరణ) బిల్లు, 2026ను ఒక రోజు ముందు బుధవారం రాజ్యసభ ఆమోదించింది. ఇప్పుడు దిగువ సభలో కూడా ఆమోదించడంతో త్వరలోనే ఇది చట్టరూపం దాల్చనున్నది. ఈ బిల్లు ప్రకారం వందేమాతర గేయం ఆలపిస్తున్నప్పుడు ఆటంకాలు సృష్టించినా, అడ్డుకున్నా అదే మాదిరిగా మూడేండ్ల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధిస్తారు. నీట్ లీక్‌పై విపక్షాలు ఆందోళన కొనసాగిస్తుండగా, ఈ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించారు.

# లీకు మాఫియాను వదిలేది లేదు

(మొదటి తరువాయి)



సాంకేతిక పరిజ్ఞానాన్ని అధికంగా ఉపయోగించడం వంటి సంస్కరణలను ప్రభుత్వం ప్రవేశ పెడుతోందని ప్రధానమంత్రి అన్నారు. ఒక దాని తర్వాత ఒకటిగా నిరంతరం అడుగులు వేస్తున్నాము. పరీక్షా వ్యవస్థను సంస్కరించడం, ఫాస్ట్-ట్రాక్ చర్యలను ప్రవేశపెట్టడం లేదా రాష్ట్రాల నుండి వచ్చే సూచనలను పరిగణనలోకి తీసుకోవడం వంటి విషయాలలో మేము ముందుకు సాగుతున్నామని అని ఆయన అన్నారు.

# ఉపాధ్యాయులదే భావితరం బాధ్యత

(మొదటి తరువాయి)

ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్ కోసం పూర్తిగా అంకితం కావాలని ఆకాంక్షించారు. ఫిన్‌లాండ్, జర్మనీ దేశాల్లో ఇటీవల పర్యటించి వచ్చిన ఉపాధ్యాయుల బృందంతో గురువారం హైదరాబాద్ లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఆయన ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రిగా తనను వైదొలగాలని కొందరు కోరుతున్నారనీ, అయితే దానికిగల కారణాలు కూడా వారే చెప్పాలన్నారు. "విద్యార్థులకు నర్సరీ నుంచి ఇంటర్ వరకు బ్రేక్ ఫాస్ట్, లంచ్ ఇస్తున్నందుకా?, టీచర్ల నియామకాలు, పదోన్నతులు నిర్వహించినందుకా?, ఐటీఐలను ఏటీసీలుగా మార్చి, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినందుకా?.. ఎందుకు నేను రాజీనామా చేయాలో చెప్పాలి" అని అడిగారు. తాను విద్యాశాఖను జిజ్ఞాసతో దగ్గర పెట్టుకున్నానని చెప్పారు. ఎల్‌కేజీ పిల్లలకు ఓట్లు ఉండవని చమత్కరించారు. గత ప్రభుత్వంలో మాదిరిగా రెవెన్యూ, ఆర్థిక, సాగునీరు వంటి కీలక శాఖలు తన వద్ద లేవని అన్నారు. భవిష్యత్ తరాన్ని ఉత్తమంగా, ఉన్నతంగా తీర్చిదిద్దడమే ఆ శాఖ మంత్రిగా తన బాధ్యత అని స్పష్టంచేశారు.

డిసెంబర్‌లోగా విద్యాభివృద్ధి నివేదిక ఇవ్వండి

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ఇంకా ఏం చేయాలో సూచించాలని ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా కోరారు. వచ్చే విద్యా సంవత్సరానికి ఏం చేస్తే బాగుంటుందో



డిసెంబరులోగా నివేదిక రూపొందించి సమర్పించాలని ఆదేశించారు. ప్రతి మండలాన్ని ఒక క్లస్టర్ గా ఏర్పాటు చేసి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. సమాజంలో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు విద్య పునాదిగా పని చేస్తుందన్న తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వ్యాఖ్యలను సీఎం గుర్తు చేశారు. అందుకే విద్య రంగానికి, కరువును పారదోలేందుకు సాగునీటిపారుదలకు నెహ్రూ ప్రాధాన్యతనిచ్చారని తెలిపారు. ఆయన దూరదృష్టితోనే నేడు తెలంగాణ 2 కోట్ల 85 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని ఉత్పత్తి చేయగలిగిందని తెలిపారు. హరిత విప్లవం, పంచవర్ష ప్రణాళికలు తెచ్చిన నాయకులు ఎవరో ప్రజలకు తెలుసునని వ్యాఖ్యానించారు.

నాటి గురుకులాలే నేటి 'నవోదయాలు'

మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు ఏర్పాటు చేసిన గురుకులాలే నేటి నవోదయ విద్యాలయాలకు స్ఫూర్తి అని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఆనాటి నాయకులు తెచ్చిన సంస్కరణలతో విద్య అందిందనీ, ఆకలి తీరిందని వివరించారు. కానీ నేటి ప్రపంచంతో పోటీ పడాలంటే అది సరిపోదని తెలిపారు. ప్రతీ పేదవాడిని ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దాలనీ, నాణ్యమైన విద్య, పౌష్టిక ఆహారం అందిచడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఆ దిశగా తెలంగాణను తీర్చి దిద్దే ప్రతినిధులు ఉపాధ్యాయులేనని అన్నారు. వెనకబాటుతనానికి ఆస్తులు, అంతస్తులతో సంబంధం లేదనీ, విద్య లేకపోవడమే అసలైన వెనకబాటుతనమని ముఖ్యమంత్రి తెలిపారు.

విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి

ఒక్కో విద్యార్థిపై రాష్ట్ర ప్రభుత్వం రూ.1.8 లక్షలు ఖర్చు చేస్తున్నా... తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రయివేటు స్కూళ్లకే ఎందుకు పంపుతున్నారో ఆలోచించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. తల్లిదండ్రులు ఒక్కో పిల్లవాడిపై ఏడాదికి సుమారు రూ.50 వేలు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. అయితే తమ ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా ఈ యేడాది సర్కారు బడుల్లో లక్ష మంది విద్యార్థులు అదనంగా చేరారని చెప్పారు. విద్యతోపాటు నైపుణ్యాలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఇంగ్లీష్ ఒక్కటే ముఖ్యమనుకుంటే చైనా ప్రపంచాన్ని ఎలా శాసిస్తోంది? అని సీఎం ప్రశ్నించారు.

# అమెరికా బేస్‌లపై క్షిపణులతో ఇరాన్ దాడి

**- జోర్డాన్‌లో 8,000 మైళ్ల వేగంతో దూసుకొచ్చే క్షిపణుల దాడులు**
**- దూసుకొచ్చిన 5 క్షిపణులను గాల్లోనే కూల్చివేసిన జోర్డాన్ సైన్యం**
**- ఇరాన్‌పై భీకర దాడికి దిగుతామని ట్రంప్ హెచ్చరిక**



వాషింగ్టన్:
పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు మళ్లీ రగులుతున్నాయి. జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులతో దాడికి యత్నించిన తర్వాత యూఎస్ సైతం ప్రతిదాడికి దిగింది. ఇరాన్ సైన్యం అమెరికా స్థావారాలను లక్ష్యంగా చేసుకుని బాలిస్టిక్ క్షిపణి దాడికి దిగినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ పేర్కొంది. ఇరాన్ నుంచి అనేక బాలిస్టిక్ క్షిపణులు జోర్డాన్‌లోని అమెరికా సైనిక కాంపౌండ్ వైపు దూసుకొచ్చినట్లు సెంట్రల్ కమాండ్ తెలిపింది. అమెరికా ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ తక్షణమే అప్రమత్తమై, ఇరాన్ ప్రయోగించిన అన్ని క్షిపణులను గాల్లోనే విజయవంతంగా అడ్డుకుని ధ్వంసం చేసినట్లు పేర్కొంది. ఈ దాడిలో ఎలాంటి ప్రాణ ఆస్తి నష్టం జరిగినట్లు ఇప్పటి వరకు సమాచారం లేదని జోర్డాన్ సైన్యం స్పష్టం చేసింది. వైమానిక అధికారులు భద్రతా కారణాల దృష్ట్యా నిర్దిష్ట సైనిక స్థావరం పేరును బయటికి చెప్పనప్పటికీ ఈ దాడి జోర్డాన్ సరిహద్దులోని కీలక అమెరికా స్థావరాన్నే లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. శాంతి ఒప్పందం నేపథ్యంలో అమెరికా తన వైమానిక దాడులను నిలిపివేసిన తర్వాత ఇరాన్ నేరుగా అమెరికా మిలిటరీ కాంపౌండ్‌పై జరిపిన మొదటి బాలిస్టిక్ క్షిపణి దాడి ఇదే.

ఇక మా వంతు-- ఇరాన్‌పై భీకర దాడులు చేస్తాం: ట్రంప్

జోర్డాన్, ఈజిప్ట్‌లో అమెరికా బేస్‌లు, కంపెనీలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ చేసిన దాడులపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మండిపడ్డారు. ఓ న్యూస్ ఛానెల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. అమెరికా బలగాలు, ఆస్తులపై దాడి చేస్తే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. జోర్డాన్‌లోని కీలక అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ సైన్యం బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించినట్లు ఆయన తెలిపారు. ఇరాన్ ఐదు క్షిపణులను తమ వైమానిక స్థావరంపైకి ప్రయోగించిందన్న ట్రంప్ వాటిని గాల్లోనే అడ్డుకుని ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. ఈజిప్టు పోర్టులో అమెరికాకు చెందిన సహాయవాయువు ట్యాంకర్ లక్ష్యంగా చేసిన దాడిపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసారి తమ వంతు అన్న ఆయన ఇరాన్‌పై భీకరస్థాయిలో దాడి చేయనున్నట్లు వెల్లడించారు.

"మనం వారిని చాలా తీవ్రంగా దెబ్బతీయబోతున్నాం. అంటే వాళ్లు చేయగలిగింది ఏమీ లేదు. మనం బృందం కంటే అది ఒక ఛిన్నమైనది. వారు ఇప్పటికే క్షమాపణలు చెప్పారు. కానీ మనం వారికి కొద్దిగా బుద్ధి చెప్పాలి. వారు గంటకు 8,000 మైళ్ల వేగంతో దూసుకొచ్చే ఐదు క్షిపణులను మనపైకి ప్రయోగించారు. అదృష్టవశాత్తూ మనవాళ్లు ప్రపంచంలోనే అత్యుత్తమ రక్షణ పరికరాలను, అంటే పేట్రియాట్ వ్యవస్థను నడుపుతున్నారు. ఒకసారి ఆలోచించండి, గంటకు 8,600 మైళ్ల వేగంతో దూసుకొస్తున్న ఐదు భారీ క్షిపణులు నేరుగా మా వైపు వచ్చాయి. ఆ ఐదింటినీ మేం కూల్చివేశాం. అదెలా ఉందో చూశారా? చాలా అద్భుతంగా ఉంది. మన దేశం తప్ప ప్రపంచంలో మరే దేశం కూడా అలా చేయలేదు."

## అంగన్‌వాడీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

(మొదటి తరువాయి)

సమావేశంలో పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల మౌలిక వసతులు, సిబ్బంది నియామకాలు, చిన్నారుల పోషకాహారం, పాఠశాల పూర్వ విద్య, దత్తత కేంద్రాలు, బాల్య వివాహాల నివారణ తదితర అంశాలపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మిగిలిపోయిన మౌలిక వసతుల పనులను ఏమాత్రం జాప్యం చేయకుండా పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ వంటి పనులు జరుగుతున్న ప్రాంతాల్లో సంబంధిత ఈఈలు, డీఈలతో సమన్వయం చేసుకుని పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. ఏ కేంద్రంలో ఏ పని జరగాల్సి ఉంది, ఇంకా ఎంత పని మిగిలి ఉందనే వివరాలతో నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న పోషకాహారం, వారి ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. సర్వే ఫలితాల ఆధారంగా పోషకాహార కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని సూచించారు. అంగన్‌వాడీ చిన్నారులకు పాలు, బ్రేక్‌ఫాస్ట్ అందించే కార్యక్రమాలను ఏ మాత్రం ఆలస్యం చేయకుండా అన్ని జిల్లాల్లో అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం అమలవుతున్న కార్యక్రమాలను దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ప్రతి చిన్నారికి పోషకాహారం అందేలా చూడాలని ఆదేశించారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో గత ఏడాది కాలంలోనే అదనంగా 5,938 కేంద్రాలకు టాయిలెట్ సదుపాయం, 3,815 కేంద్రాలకు తాగునీటి సదుపాయం, 14,271 కేంద్రాలకు విద్యుత్ సదుపాయం కల్పించినందుకు అధికారులు, సిబ్బందిని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క అభినందించారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కేంద్రాలకు కనీస మౌలిక వసతులు కూడా పూర్తిస్థాయిలో అందలేదని పేర్కొన్న మంత్రి.. రాష్ట్రంలోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో వంద శాతం టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నేడు సచివాలయంలో మహిళా శిశుసంక్షేమ శాఖపై మంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. శాఖ కార్యదర్శి శృతి ఓజా, జాయింట్ డైరెక్టర్ మోతి తదితర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల మౌలిక వసతులు, సిబ్బంది నియామకాలు, చిన్నారుల పోషకాహారం, పాఠశాల పూర్వ విద్య, దత్తత కేంద్రాలు, బాల్య వివాహాల నివారణ తదితర అంశాలపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మిగిలిపోయిన మౌలిక వసతుల పనులను ఏమాత్రం జాప్యం చేయకుండా పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ వంటి పనులు జరుగుతున్న ప్రాంతాల్లో సంబంధిత ఈఈలు, డీఈలతో సమన్వయం చేసుకుని పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. ఏ కేంద్రంలో ఏ పని జరగాల్సి ఉంది, ఇంకా ఎంత పని మిగిలి ఉందనే వివరాలతో నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న పోషకాహారం, వారి ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. సర్వే ఫలితాల ఆధారంగా పోషకాహార కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని సూచించారు. అంగన్‌వాడీ చిన్నారులకు పాలు, బ్రేక్‌ఫాస్ట్ అందించే కార్యక్రమాలను ఏ మాత్రం ఆలస్యం చేయకుండా అన్ని జిల్లాల్లో అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం అమలవుతున్న కార్యక్రమాలను దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ప్రతి చిన్నారికి పోషకాహారం అందేలా చూడాలని ఆదేశించారు.


# వర్షాల నేపథ్యంలో ముందస్తు చర్యలు

(మొదటి తరువాయి)

ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలు లేదా పునరావాస కేంద్రాలకు తరలించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే తక్షణమే స్పందించి సహాయక చర్యలు అందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్ నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా రవాణా, విద్యుత్, తాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా హైడ్రా, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సాధారణ జీవనానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశామనీ, నిజామాబాద్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామని తెలిపారు. వచ్చే రెండ్రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.

# మెటాకు కేంద్రం సమన్లు


**- వారం రోజుల్లో హాజరు కావాలని ఆదేశం**
**- ప్రధాని మోదీ వీడియో తొలగింపు ఘటనపై కేంద్రం సీరియస్**
**-విధానపరమైన, సాంకేతిక అంశాలపై వివరణ ఇవ్వాలని సూచన**
**- జులై 28 నుంచి ప్రముఖుల ఖాతాలకు కొత్త ప్రోటోకాల్స్ అమలు చేస్తున్నామని మెటా వెల్లడి**




న్యూఢిల్లీ
ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంబంధించిన వీడియో తొలగింపు వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన వేళ, కేంద్ర ప్రభుత్వం మెటాపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు సంస్థ అత్యున్నత ప్రతినిధులు హాజరై వివరణ ఇవ్వాలని కేంద్రం ఆదేశించింది. వచ్చే వారం నుంచి పది రోజుల లోపు మెటా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులను కలిసి విధానపరమైన, సాంకేతిక అంశాలపై వివరణ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్ గురువారం ఆ విషయాన్ని వెల్లడించారు. మెటా ప్లాట్‌ఫామ్స్ లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు, ముఖ్యంగా ప్రముఖుల ఖాతాలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎలా తలెత్తుతున్నాయి? వాటి వెనుక ఉన్న సాంకేతిక కారణాలేంటి? భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంస్థ ఎలాంటి చర్యలు తీసుకుంటోంది? అనే అంశాలపై ప్రభుత్వం స్పష్టత కోరుతోందని ఆయన తెలిపారు. "మెటాను అత్యున్నత స్థాయిలో హాజరుకావాలని కోరాం. ప్రస్తుతం కనిపిస్తున్న సమస్యలు ఎందుకు వస్తున్నాయి? వాటి వెనుక కారణాలేమిటి? అన్ని విషయాలను వారు వివరించాల్సి ఉంది. విధానపరంగానూ, సాంకేతికంగానూ వాటిని పరిశీలిస్తున్నాం" అని, కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ కార్యదర్శి తెలిపారు.
ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంబంధించిన ఫేస్‌బుక్ వీడియో అకస్మాత్తుగా కనిపించకుండా పోవడం వివాదానికి దారితీసింది. పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీపై చర్చలకు సంబంధించిన ఆ వీడియోను మెటా యాజమాన్యంలోని ఫేస్‌బుక్ పొరపాటున తొలగించినట్లు తర్వాత సంస్థ అంగీకరించింది. సాంకేతిక లోపం కారణంగానే వీడియో తొలగింపు జరిగిందని, అనంతరం దాన్ని తిరిగి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మెటా ప్రతినిధులు వివరణ ఇచ్చారు. ఆ వీడియో వాస్తవానికి జులై 23న విడుదలైంది. నీట్-యూజీ 2026 పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ సాగుతున్న విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో ప్రధాని మోదీ యువతను ఉద్దేశించి చేసిన తొలి ప్రత్యక్ష సందేశంగా దీనికి ప్రాధాన్యం ఏర్పడింది.

## అఫ్ఘానిస్థాన్‌లో వధువు మేకప్‌పైనా నిషేధం

(మొదటి తరువాయి)



ధరించటం, మెహంది వేసుకోవటం, పొడవైన జడ కోసం జడ కుచ్చులు వాడటం, అత్తరులు జల్లుకోవటం సర్వసాధారణం. ఇవేవీ ఇకపై పెండ్లి వేడుకల్లో కనిపించడానికి వీల్లేదు అంటూ ఆదేశాలు జారీ అయ్యాయి. కొత్త రూల్స్‌పై మసీదుల్లో మత గురువులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వధూవరులు ఉంగరాలు మార్చుకోవటం, పాటలు పాడుతూ డ్యాన్సులు చేయటాన్ని ఇప్పటికే బ్యాన్ చేశారు. ఈ విధమైన సంప్రదాయాలు, పద్ధతులు పాశ్చాత్య సంస్కృతి ప్రభావాన్ని పెంచుతాయని తాలిబన్లు చెబుతున్నారు.

## అమిత్ షా రాజీనామా చేయాలి


-సీజేపీ చీఫ్ దీప్కే డిమాండ్



**న్యూఢిల్లీ, జూలై 30 జర్నలిస్ట్ డైరీ,**
విద్యార్థుల అణచివేతకు పాల్పడిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే డిమాండ్ చేశారు. ఈనెల 20న నిర్వహించిన చలో పార్లమెంట్‌లో విద్యార్థులపై చర్యలకు హోంమంత్రి అమిత్ షా మాత్రమే ఆదేశాలు ఇవ్వగలరని ఆరోపించారు.గురువారం మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లోని స్వగృహంలో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని అన్నారు. విద్యార్థులు చేస్తున్న ఆందోళనపై బలప్రయోగానికి ఇచ్చిన ఆదేశాలకు అమిత్ షాయే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను బెదిరించడం ప్రభుత్వం మానుకోవాలన్నారు.

## ఆలయ హుండీల్లో డబ్బు చోరీ..

- దేవుడికి 'క్షమాపణ' చెప్పిన దొంగ



**న్యూఢిల్లీ, జూలై 30 జర్నలిస్ట్ డైరీ,**
దొంగలు రెండు ఆలయాల్లో దొంగతనానికి పాల్పడ్డారు. ఒక ఆలయంలోని హుండీ చోరికి ముందు ఒక దొంగ దేవతకు మొక్కి క్షమాపణ చెప్పాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జూలై 27న రాత్రి వేళ మల్ధక్కా ప్రాంతంలోని శీతలా మాత ఆలయం, శివాలయంలో దొంగతనం జరిగింది. ఇద్దరు వ్యక్తులు ఆలయాల్లోకి ప్రవేశించారు. హుండీని పగులగొట్టారు. అందులోని కానుకల డబ్బును దొంగిలించారు. హుండీ చోరికి ముందు ఒక దొంగ దేవతకు మొక్కి క్షమాపణ చెప్పాడు. ఆ తర్వాత దొంగలు అక్కడి నుంచి పారిపోయారు.కాగా, ఆలయ ప్రాంగణానికి వేసిన తాళం పగిలి ఉండటాన్ని మరునాడు ఉదయం ఆలయ సంరక్షకుడు గమనించారు. రెండు ఆలయాల్లోని హుండీ డబ్బులు చోరీ అయ్యినట్లు గ్రహించారు. ఆలయాల్లోని సీసీటీవీ ఫుటేజ్ ద్వారా దీనిని నిర్ధారించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు దొంగలను గుర్తించేందుకు సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలిస్తున్నారు. అయితే ఆలయంలోని హుండీ చోరికి ముందు ఒక దొంగ దేవతకు మొక్కి క్షమాపణ చెప్పిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## అమెరికా ఆయుధ నిల్వలు ఘోరంగా పడిపోయాయి..


-సీఎస్ఐఎస్ నివేదికలో వెల్లడి



**న్యూఢిల్లీ, జూలై 30 జర్నలిస్ట్ డైరీ,**
ప్రపంచంలో మాకు ఎదురులేదని, సైనిక, సాంకేతిక రంగాల్లో అమెరికాకు తిరుగులేదని విర్రవీగిన యూఎస్‌ను ఇరాన్ ముప్పు తిప్పలు పెడుతున్నది. అమెరికా అజేయమైన సైనిక శక్తేంకాదు గత కొద్ది రోజులుగా పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధంతో తేలిపోయింది. తాజాగా ఇరాన్‌తో జరుగుతున్న సుదీర్ఘ సైనిక ఘర్షణల కారణంగా అమెరికా రక్షణ ఆయుధ నిల్వలు భారీగా పడిపోయినట్లు ప్రముఖ థింక్ ట్యాంక్ ' సెంటర్ ఫర్ స్టాజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ నివేదిక వెల్లడించింది. 2026 ఫిబ్రవరిలో ప్రారంభమైన ఈ యుద్ధంలో అమెరికా తన అత్యంత కీలకమైన రక్షణ క్షిపణులను పెద్ద మొత్తంలో ఉపయోగించాల్సి వచ్చింది. దీంతో ప్రపంచ పోలీస్ పాత్ర పోషిస్తున్న అమెరికాలో ఆందోళనలో మొదలయింది. ఇరాన్ యుద్ధ సమయంలో అమెరికా పేట్రియాట్ ఇంటర్‌సెప్టర్ల నిల్వ సుమారు 65% తగ్గిపోయిందని థింక్ ట్యాంక్ అంచనాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం అమెరికా వద్ద 827 పేట్రియాట్, 278 థాడ్ క్షిపణులే ఉన్నట్లు పేర్కొంది. నిన్న ఇరాన్‌పై దాడికి ముందు గతం వారం రోజుల నుండి అమెరికా యుద్ధం ఆపివేయడానికి ఇదే కారణమని సదరు నివేదిక స్పష్టం చేస్తున్నది.

## ఆగస్టు 15 నుంచి ఆన్‌లైన్ ఆర్డర్లు బంద్..

- బెంగళూరు రెస్టారెంట్ల ప్రకటన
-ఫుడ్ డెలివరీ యాప్‌ల చార్జీలపై నిరసన




**న్యూఢిల్లీ, జూలై 30 జర్నలిస్ట్ డైరీ,**
: బెంగళూరు రెస్టారెట్లు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఆగస్టు 15 నుంచి స్విగ్గీ, జొమాటో, ఇతర ఫుడ్ డెలివరీ యాప్‌ల నుంచి ఆన్‌లైన్ ఆర్డర్లను ఆపేస్తున్నట్టు బృహత్ బెంగుళూరు హోటల్స్ అసోసియేషన్, ఇతర రెస్టారెంట్ గ్రూపులు ప్రకటించాయి.ఫుడ్ డెలివరీ యాప్‌లు సాధారణ కమీషన్‌తో పాటు పేమెంట్ గేట్ వే ఫీజులు, ప్రచార చార్జీలు ప్రకటనల ఖర్చులు, డిస్కౌంట్‌లు, లాయల్టీ ప్రోగ్రామ్ పేరుతో విధించే కోతలతో రెస్టారెంట్ల ఓనర్లు సతమతం అవుతున్నారని బీబీహెచ్‌ఏ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం తెలిపారు. తమ అనుమతి లేకుండానే విధిస్తున్న అదనపు చార్జీలపై వివరణ ఇవ్వాలని కోరారు.

## నీట్ పేపర్ లీకేజీ ఆందోళనకారులపై

# చట్టపరమైన చర్యలు వద్దు..

-ఢిల్లీ ప్రభుత్వం ఆదేశం



**న్యూఢిల్లీ, జూలై 30 జర్నలిస్ట్ డైరీ,**
నీట్ పేపర్ లీకేజీపై చేపట్టిన ఆందోళన సందర్భంగా దాడులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే విషయంలో ఢిల్లీ ప్రభుత్వం వెనక్కు తగ్గింది. ఆందోళనకారులపై ఎలాంటి చర్యలు తీసుకోబోవడం లేదని తెలిపింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాల్ని పాటిస్తామని స్పష్టం చేసింది. నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ సీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 20న జరిగిన ఆందోళన ఘర్షణకు దారితీసిన సంగతి తెలిసిందే. కొన్ని చోట్ల విద్యార్థులు, పోలీసులు పరస్పరం దాడికి దిగారు. పోలీసులు, భద్రతా బలగాలపైకి ఆందోళనకారులు రాళ్లు రువ్వారు.ఈ ఘటనలో పలువురు గాయపడగా.. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు ధ్వంసమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆందోళనకు పాల్పడిన వారిపై ఢిల్లీ ప్రభుత్వం చర్యలకు దిగింది. ఆందోళనకు పాల్పడిన వారిలో పలువురిని గుర్తించి ఇప్పటికే కొందరిని అదుపులోకి తీసుకోగా.. ఇంకొందరిని అరెస్టు చేశారు ఢిల్లీ పోలీసులు. మరికొందరిని గుర్తించే పనిలో ఉన్నారు. అనేకమందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. అయితే, ఈ దాడులకు పాల్పడిన మైనర్లపై, గతంలో క్రిమినల్ కేసులు లేనివారిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో బిహార్, అసోం వంటి అనేక రాష్ట్రాలు నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండానే వదిలేశాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఢిల్లీ ప్రభుత్వం కూడా స్పందించింది. ఈ మేరకు ఢిల్లీ హోం మంత్రిత్వ శాఖ గురువారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేసింది. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా గతంలో ఎలాంటి క్రిమినల్, నేర చరిత్ర లేని ఆందోళనకారులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోవడం లేదని ప్రకటించింది. అలాగే, అదుపులోకి తీసుకున్న లేదా అరెస్టు చేసిన నిందితుల్ని వదిలేస్తామని కూడా ప్రకటించింది. అయితే, ముందుగా నిందితుల వివరాలు, నేర చరిత్రను సమీక్షించిన తర్వాతనే కేసులు ఎత్తివేస్తామని, వారిని విడుదల చేస్తామని చెప్పింది. ఒకవేళ గతంలో క్రిమినల్ కేసులుంటే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. తమ నిర్ణయానికి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ కూడా ఆమోదం తెలిపారని ప్రభుత్వం వెల్లడించింది.

## జెర్సీలు మార్చినా భారతదేశం

# ఆత్మను ఎవరూ మార్చలేరు

ప్రియాంకాగాంధీ



**న్యూఢిల్లీ, జూలై 30 జర్నలిస్ట్ డైరీ,**
భారత హాకీ జట్టు సంప్రదాయ నీలం జెర్సీ స్థానంలో ప్రపంచకప్ కోసం కాషాయ రంగు జెర్సీని ప్రవేశపెట్టడంపై మొదలైన చర్చ రాజకీయరంగు పులుముకుంది. మాజీ కెప్టెన్ విరేన్ రస్కీనా ఈ నిర్ణయాన్ని ప్రశ్నించారు. తాజాగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కూడా దీనిపై స్పందించారు. జెర్సీ మార్పు ఒక్కటే కాదని, చరిత్రను మార్చే ప్రయత్నాలు జరిగినా దేశ యువత తన అభిప్రాయాన్ని ఇప్పటికే స్పష్టం చేసిందని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ బయట మీడియాతో మాట్లాడిన ఆమె.. దేశ ఆత్మను మాత్రం మార్చలేరని అన్నారు.జెర్సీ మార్చినా, విద్యా విధానంలో చరిత్రను తిరగరాయాలని చూసినా ప్రజల ఆలోచనలను మార్చడం సాధ్యం కాదని ప్రియాంకగాంధీ పేర్కొన్నారు. జంతర్‌మంతర్‌లో యువత వ్యక్తంచేసిన అభిప్రాయాలే దేశ స్వరమని చెప్పారు. భారత స్వాతంత్ర్య పోరాటం అహింస, సత్యం అనే విలువలపై నిర్మితమైందని ఆమె గుర్తుచేశారు. ఆ ఉద్యమంలో ఆర్ఎస్ఎస్‌కు ఎలాంటి పాత్ర లేదని, ఈ విషయం దేశ ప్రజలకు బాగా తెలుసని వ్యాఖ్యానించారు. మహాత్మాగాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపిందని చెప్పారు. సోదరభావం, ఐక్యత, సత్యం, అహింసలోనే దేశ ఆత్మ ఉందని ప్రియాంక స్పష్టంచేశారు. ద్వేషం రెచ్చగొట్టినా, హింసను ప్రోత్సహించినా భారత మూల విలువలను ఎవరూ చెరిపేయలేరని అన్నారు. దేశ ఐక్యతను దెబ్బతీయాలనే ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవని చెప్పారు. రాజకీయ భావజాలం పేరుతో దేశ స్వభావాన్ని మార్చడం అసాధ్యమని అభిప్రాయపడ్డారు. ప్రపంచకప్ కోసం ప్రకటించిన కొత్త జెర్సీపై భారత హాకీ మాజీ కెప్టెన్ విరేన్ రస్కీనా తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. భారత హాకీ అంటే అభిమానులకు ముందుగా గుర్తుకొచ్చేది నీలం జెర్సీయేనని చెప్పారు. తాను ఎన్నో ఏళ్లు దాన్నే ధరించి దేశానికి ప్రాతినిధ్యం వహించానని గుర్తుచేశారు. అభిమానుల మనసుల్లో ఆ రంగుకే ప్రత్యేక స్థానం ఉందని, అలాంటప్పుడు కాషాయ రంగును ఎందుకు ఎంచుకున్నారో అర్థం కావడంలేదని ప్రశ్నించారు. రస్కీనా వ్యాఖ్యల తర్వాత హాకీ ఇండియా కొత్త జెర్సీ రూపకల్పన వెనుక ఉన్న ఉద్దేశాన్ని వివరించింది. కాషాయ రంగు ధైర్యం, త్యాగం, విజయానికి ప్రతీకగా ఎంచుకున్నట్లు తెలిపింది. భారత జాతీయ పతాకం, ఉదయించే సూర్యుడి స్ఫూర్తితో ఈ రంగును తీసుకున్నామని పేర్కొన్నది అశోకచక్రాన్ని గుర్తుచేసే నేవీ బ్లూ అంచులు, మండల కళారూపాలు, సుదర్శన చక్రం స్ఫూర్తితో రూపొందించిన డిజైన్ భారత సంస్కృతి, ఐక్యత, పురోగతిని ప్రతిబింబిస్తుందని వెల్లడించింది. 'ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్' భావనకు అనుగుణంగానే ఈ జెర్సీని రూపొందించినట్లు హాకీ ఇండియా

## ఈ20 పెట్రోల్ వాడాలంటే పాత

# వాహనాల్లో పార్ట్‌లు మార్చాల్సిందే..

-పార్లమెంట్‌లో వెల్లడించిన నితిన్ గడ్కరీ



**న్యూఢిల్లీ, జూలై 30 జర్నలిస్ట్ డైరీ,**
ఈ20 పెట్రోల్ విషయంలో అనేక వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ20 పెట్రోల్ వల్ల వాహనాలు పాడవుతున్నాయని కొందరు యజమానులు అంటుంటే.. అలాంటిదేం లేదని కేంద్రం చెబుతోంది. అందులోనూ పాత వాహనాలు బాగా దెబ్బతింటున్నాయనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ అంశంపై పార్లమెంట్‌లో కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పందించారు. కొన్ని రకాల పాత (బీఎస్–3) వాహనాలు ఈ20 పెట్రోల్‌తో నడవాలంటే కొన్ని పార్ట్‌లు మార్చుకోవాల్సిందే అని స్పష్టం చేశారు.ఇథనాల్ కలిసిన పెట్రోల్‌తో పనిచేయాలంటే వాహనాల ఇంజిన్‌కు మోడిఫికేషన్ అవసరం లేదని, అలాగే, వాటి సామర్థ్యంలో కూడా మార్పు ఉండబోదని గడ్కరీ తెలిపారు. ఒక ప్రశ్నకు సమాధానంగా పార్లమెంట్‌లో బుధవారం గడ్కరీ ఈ వివరాల్ని వెల్లడించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం (ఐఐపీ), డెహ్రాడూన్‌తోపాటు ఎస్ఐఏఎం, ఏఆర్ఏఐ సంస్థలతో కలిపి సంయుక్తంగా నిర్వహించిన సర్వే ఆధారంగా ఈ వివరాలు వెల్లడిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే, కొన్ని పాత బీఎస్–3 వాహనాలకు సంబంధించి కొన్ని రబ్బర్ పార్ట్‌లు, కంపోనెంట్స్ మార్చుకోవాల్సి ఉంటుందని తెలిపారు. బీఎస్–3 వాహనాలు ఏప్రిల్ 1, 2005న అందుబాటులోకి వచ్చాయన్నారు. అప్పటినుంచి 2016లోపు తయారైన వాహనాల్లోనే విడిభాగాలు మార్చుకోవాల్సి ఉంటుందని వివరించారు. కొన్ని రబ్బర్ పార్ట్స్, గ్యాస్కెట్లు మారిస్తే సరిపోతుందన్నారు. వాహనాల రెగ్యులర్ సర్వీస్ ద్వారా ఈ పార్ట్స్ మార్చుకోవచ్చని, ఇందుకోసం పెద్దగా మోడిఫికేషన్స్ అవసరం లేదని గడ్కరీ చెప్పారు. ఈ కేటగిరికి చెందిన టూవీలర్లు, కార్లలో ఈ20 పెట్రోల్ వినియోగానికి సంబంధించి ఇంజిన్‌లలో మార్పులు చేయక్కర్లేదని స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో ఈ20 పెట్రోల్ వల్ల వాహనాలు పాడవుతున్నాయని, ఉన్నట్లుండి బ్రేక్‌డౌన్ అవుతున్నాయని, మైలేజ్ తగ్గుతోందని వాహనదారులు ఫిర్యాదు చేస్తున్నారు. దీనిపై గడ్కరీ స్పందిస్తూ మైలేజీ తగ్గడానికి ఈ20 పెట్రోల్ ఒక్కటే కారణం కాదని, అనేక అంశాల ఆధారంగా మైలేజీ తగ్గడం, పెరగడం జరుగుతుందని వివరించారు.

## అధికార బీజేపీకి విద్యార్థుల భవిష్యత్తు కంటే రాజకీయాలే ఎక్కువ



**న్యూఢిల్లీ, జూలై 30 జర్నలిస్ట్ డైరీ,**
ప్రభుత్వ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీ లను అరికట్టేందుకు తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు–2026పై రాజ్యసభ లో తీవ్ర వాగ్వాదం జరిగింది. చర్చ సందర్భంగా ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కంటే రాజకీయాలకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని ఆరోపించారు.ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు వ్యవహరించిన తీరుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై లాఠీచార్జి జరిగిందని ఖర్గే ఆరోపించారు. ఢిల్లీ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలోనే పనిచేస్తాయని గుర్తుచేశారు. ఆ శాఖ అనుమతి లేకుండా ఇలాంటివి జరిగే అవకాశం లేదని అన్నారు. ఈ ఘటనపై అమిత్ షా తన బాధ్యత నుంచి తప్పించుకోలేరని వ్యాఖ్యానించారు. విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలపై ఆయన సభలో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టే బిల్లును ఇంత ఆలస్యంగా ఎందుకు తీసుకొచ్చారని ఖర్గే ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడే సంస్కరణలు చేయకుండా ప్రభుత్వం రాజకీయాల్లోనే నిమగ్నమైందని విమర్శించారు. ఢిల్లీలో విద్యార్థుల ఆందోళనలను చల్లార్చేందుకే ఈ బిల్లును తీసుకొచ్చారని ఆరోపించారు. బీజేపీ రాజకీయాల వల్లే దేశంలో ప్రశ్నపత్రాల లీకేజీలు, నిరసనలు, పోలీసు చర్యలు చోటుచేసుకున్నాయని అన్నారు. పేపర్ లీకేజీలు జరిగిన తర్వాత నష్టనివారణ చర్యలు తీసుకోవడం ఒక్కటే సరిపోదని ఖర్గే అభిప్రాయపడ్డారు. ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు ప్రభుత్వం అనుసరించబోయే స్పష్టమైన కార్యాచరణను వివరించలేదని విమర్శించారు. ఈ బిల్లు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుందా అన్న సందేహాన్ని వ్యక్తంచేశారు. గత రెండు నెలలుగా విద్యార్థులు, యువత దేశవ్యాప్తంగా పరీక్షల వ్యవస్థపై నిరసనలు వ్యక్తంచేశారని ఖర్గే గుర్తుచేశారు. వారి గొంతుకను ప్రతిపక్షం వీధుల నుంచి పార్లమెంట్ వరకు వినిపించిందన్నారు. ప్రజల ఒత్తిడి పెరగడంతో ప్రభుత్వం చివరకు వెనక్కి తగ్గిందని వ్యాఖ్యానించారు. విద్యార్థుల పోరాటం ఫలించిందని, వారి ఉద్యమంవల్లే ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని అన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# జెన్-జీ గర్జన..
# మోదీ ఇమేజ్‌కు అంతర్జాతీయ హెచ్చరిక

భారత రాజకీయాల్లో ఎన్నో ఉద్యమాలు వచ్చాయి, వెళ్లాయి. కానీ ఇటీవల జెన్-జీ యువత ఆధ్వర్యంలో జరిగిన "కాక్రోచ్ జనతా పార్టీ" ఉద్యమం మాత్రం కేవలం దేశీయ రాజకీయ సంఘటనగా మిగలలేదు. ఇది ప్రపంచ మీడియా దృష్టిని ఆకర్షించింది. నిరుద్యోగం, పరీక్షా పత్రాల లీకులు, విద్యా వ్యవస్థపై అవిశ్వాసం, ప్రభుత్వ జవాబుదారీతనం వంటి అంశాలను కేంద్రంగా చేసుకున్న ఈ ఉద్యమాన్ని అనేక అంతర్జాతీయ మీడియా సంస్థలు భారత రాజకీయాల్లో కొత్త మలుపుగా అభివర్ణించాయి. ఈ పరిణామం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యక్తిగత ప్రతిష్ఠకు ఎంత మేర ప్రభావం చూపిందనే అంశంపై భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, అంతర్జాతీయ స్థాయిలో భారత ప్రజాస్వామ్యంపై చర్చను మళ్లీ తెరపైకి తీసుకువచ్చిందనేది తిరస్కరించలేని వాస్తవం.



ఈ ఉద్యమాన్ని అంతర్జాతీయ మీడియా కేవలం విద్యార్థుల ఆందోళనగా కాకుండా, యువతలో పెరుగుతున్న అసంతృప్తికి ప్రతీకగా చిత్రీకరించింది." రాయిటర్స్" ఈ ఉద్యమాన్ని మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన ఎదుర్కొన్న అతిపెద్ద యువజన సవాలుగా పేర్కొంది. విద్యా వ్యవస్థలో అవకతవకలు, నిరుద్యోగం, సామాజిక మాధ్యమాల ద్వారా యువత వేగంగా సమీకృతం కావడం వంటి అంశాలను ప్రత్యేకంగా ప్రస్తావించింది. అలాగే ఉద్యమానికి సామాజిక మాధ్యమాల్లో కోట్లాది మంది యువత మద్దతు లభించిందని పేర్కొంది.

"అసోసియేటెడ్ ప్రెస్" ఈ నిరసనల్లో హాస్యం, వ్యంగ్యం, మీమ్స్‌ను ఆయుధాలుగా ఉపయోగించిన తీరును ప్రత్యేకంగా విశ్లేషించింది. ఒకప్పుడు మోదీ రాజకీయ ఎదుగుదలకు బలమైన వేదికగా నిలిచిన సామాజిక మాధ్యమాలనే ఇప్పుడు యువత ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి వినియోగిస్తోందని వ్యాఖ్యానించింది. భారత జనాభాలో దాదాపు సగం మంది 25 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారేనని గుర్తుచేస్తూ, ఈ తరం రాజకీయ చైతన్యం భవిష్యత్తు రాజకీయాలను ప్రభావితం చేయగలదని సూచించింది.

"ది గార్డియన్" ఈ ఉద్యమాన్ని మోదీ "బలమైన నాయకత్వం" అనే ఇమేజ్‌కు వచ్చిన అతిపెద్ద సవాళ్లలో ఒకటిగా అభివర్ణించింది. ముఖ్యంగా పోలీసు చర్యలు, ఉద్యమకారులపై బలప్రయోగం, ప్రముఖుల మౌనం వంటి అంశాలను ప్రశ్నించింది. ఉద్యమం ప్రభుత్వంపై మాత్రమే కాకుండా, భయ వాతావరణం తగ్గుతున్న సంకేతంగా కూడా నిలిచిందని విశ్లేషించింది.

అయితే విదేశీ మీడియా కథనాలను యథాతథంగా అంగీకరించడం కూడా సరైన విధానం కాదు. ప్రతి అంతర్జాతీయ మీడియా సంస్థకు తనదైన సంపాదకీయ దృక్కోణం ఉంటుంది. కొన్ని సంస్థలు ప్రజాస్వామ్య హక్కులు, పౌర స్వేచ్ఛలపై ఎక్కువ దృష్టి పెడితే, మరికొన్ని రాజకీయ ప్రభావాలపై దృష్టి సారిస్తాయి. అందువల్ల వాటి విశ్లేషణలను విమర్శనాత్మక దృష్టితో చదవడం అవసరం. అయినప్పటికీ, ఒక విషయం మాత్రం స్పష్టమైంది. ప్రపంచ మీడియా ఈ ఉద్యమాన్ని చిన్న సంఘటనగా చూడలేదు; భారత పాలన, యువత ఆకాంక్షలు, రాజకీయ జవాబుదారీతనం వంటి విస్తృత ప్రశ్నలతో అనుసంధానించింది. ఇటీవలి సంవత్సరాల్లో "భారత ప్రజాస్వామ్య ప్రమాణాలు, మీడియా స్వేచ్ఛ, పౌర హక్కుల" పై అంతర్జాతీయ నివేదికలు తరచూ చర్చకు వస్తున్నాయి. ఉదాహరణకు, "ఫ్రీడమ్ హౌస్" తన 2026 నివేదికలో భారతదేశంలో మీడియాపై ఒత్తిడి, విమర్శనాత్మక స్వరాలపై చట్టాల వినియోగం, స్వీయ సెన్సార్ పెరుగుతున్న అంశాలను ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో జెన్-జీ ఉద్యమం ప్రపంచ దృష్టిని మరింత ఆకర్షించడం సహజమే. ఇక్కడ ఒక కీలకమైన ప్రశ్న ఉత్పన్నమవుతుంది. మోదీ ఇమేజ్ నిజంగానే దెబ్బతిన్నదా? అంతర్జాతీయ స్థాయిలో కొంత మేర విమర్శలు పెరిగిన మాట వాస్తవమే. అయితే ఒకే ఉద్యమం వల్ల ఒక నాయకుడి మొత్తం అంతర్జాతీయ ప్రతిష్ఠ కూలిపోయిందని చెప్పడానికి తగిన ఆధారాలు లేవు. ఎందుకంటే భారత ఆర్థిక వృద్ధి, విదేశాంగ విధానం, వ్యూహాత్మక భాగస్వామ్యాలు, డిజిటల్ మౌలిక సదుపాయాల విస్తరణ వంటి అంశాల కారణంగా మోదీకి ప్రపంచవ్యాప్తంగా ఇంకా గణనీయమైన గుర్తింపు ఉంది. అదే సమయంలో ప్రజాస్వామ్య విలువలు, యువత అసంతృప్తి, ఉపాధి సంక్షోభం వంటి అంశాలు ఆ ప్రతిష్ఠపై ప్రశ్నార్థకాలు కూడా లేవనెత్తుతున్నాయి. ఈ రెండు వాస్తవాలు ఒకేసారి సహజీవనం చేస్తున్నాయి.

ప్రజాస్వామ్యంలో ఒక ఉద్యమం విజయం సాధించిందా లేదా అనేది కేవలం ఒక మంత్రి రాజీనామాతో నిర్ణయించబడదు. అసలు విజయం అధికారాన్ని ప్రశ్నించే ధైర్యం సమాజంలో ఎంత పెరిగిందన్నదానిపై ఆధారపడి ఉంటుంది. అదే విధంగా ప్రభుత్వం బలాన్ని పోలీసు చర్యలతో కాకుండా, ప్రజల విశ్వాసంతో కొలవాలి. యువత లేవనెత్తిన ప్రశ్నలకు రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలతో సమాధానం చెప్పలేరు. ఉపాధి, విద్య, పారదర్శకత, జవాబుదారీతనం వంటి అంశాల్లో స్పష్టమైన చర్యలే సమాధానం. చరిత్ర చెబుతున్న పాఠం ఒక్కటే. ప్రపంచంలో ఏ నాయకుడైనా తన ఇమేజ్‌ను ప్రచారంతో నిర్మించుకోవచ్చు ఈ విషయంలో ప్రపంచం మొత్తంలో నరేంద్ర మోదీని మించిన వారు ఎవరూ లేరు. కానీ దాన్ని శాశ్వతంగా నిలబెట్టేది ప్రజల విశ్వాసం మాత్రమే. జెన్-జీ ఉద్యమం మోదీ ప్రభుత్వాన్ని కూల్చివేసిందని చెప్పడం అతిశయోక్తి. కానీ ఈ ఉద్యమం ప్రపంచానికి ఒక స్పష్టమైన సందేశాన్ని పంపింది. భారత యువత ఇక కేవలం ఓటర్లు మాత్రమే కాదు; వారు పాలనను ప్రశ్నించే, జవాబుదారీతనం కోరే శక్తిగా ఎదుగుతున్నారు. ఆ సందేశాన్ని ప్రభుత్వం ఎంత త్వరగా అర్థం చేసుకుంటే, అంత త్వరగా ప్రజాస్వామ్యం బలపడుతుంది; లేకపోతే అంతర్జాతీయ విమర్శలు మరింత తీవ్రమయ్యే అవకాశాన్ని పూర్తిగా తోసిపుచ్చలేం.

**డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.**
ramkishore.1504@gmail.com

## గల్లంతు అయిన బాలయ్య కోసం ముమ్మర గాలింపు

**- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సమీక్ష**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 30 (జర్నలిస్ట్ డైరీ)**
భారీ వర్షాల నేపథ్యంలో వరద పరిస్థితులు, ముందస్తు ఏర్పాట్లు మరియు సహాయక చర్యలపై జరిగిన మియాపూర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశం లో జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలెం పాటి, డీసీ సేవా ఇస్లావత్, డీసీ శ్రీనివాస్, సీఎంసి ఇంజనీరింగ్ విభాగం, హైడ్రా , పోలీస్ ,ట్రాఫిక్ ఎన్డీఆర్ఫ్ ,జలమండలి మరియు అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం జరిపిన పియెసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... నిన్న కురిసిన భారీ వర్షానికి వరదల సమయంలో మ్యాన్‌హోల్‌లో పడి ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని, ప్రమాదకర ప్రాంతాలను సురక్షితంగా మార్చాలని, అన్ని శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.
గల్లంతు అయిన బాలయ్య కొరకు గాలింపు చర్యలను ముమ్మరం చేశాం అని, అన్ని రకాల చర్యలు తీసుకున్నామని, ప్రతి మ్యాన్ హోల్ నుండి మ్యాన్ హోల్ వరకు క్షణంగా పరిశీలించడం జరిగినది అని, వేగవంతంగా చేసి ఆచూకీ కనుకుంటామని, ఆచూకీ కోసం శాయశక్తుల కృషి చేస్తున్నామని, ఆచూకీ లభించే వరకు గాలింపు చర్యలను కొనసాగిస్తామని తెలియచేశారు. వర్షాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని , అత్యవసరం తప్పితే బయటకు రాకూడదు అని, అధికారులు కూడా వర్షాకాలం ను దృష్టిలో పెట్టుకొని ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, పనులు జరుగుతున్న ప్రాంతాలలో రక్షణ చర్యలు చేపట్టాలని, నిర్లక్ష్యం వహించకూడదు అని తెలియచేశారు.

## బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సేవలు మరింత విస్తృతం చేయాలి

**- వట్టిపల్లి ప్రకాష్ శర్మ**



**హైదరాబాద్, (జూలై 30) జర్నలిస్ట్ డైరీ**
తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్‌ను వట్టిపల్లి ప్రకాష్ శర్మ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని బ్రాహ్మణుల సంక్షేమం కోసం పరిషత్ చేపడుతున్న కార్యక్రమాలపై చర్చించారు. ప్రకాష్ శర్మ మాట్లాడుతూ, పరిషత్ ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి బ్రాహ్మణ కుటుంబానికి చేరేలా మరింత విస్తృతంగా చర్యలు చేపట్టాలని చైర్మన్‌ను కోరారు. ముఖ్యంగా విద్య, ఉపాధి, స్వయం ఉపాధి, ఆర్థిక సహాయం, సామాజిక సంక్షేమ కార్యక్రమాలను మరింత ప్రభావవంతంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పరిషత్ సేవలు అందేలా కృషి కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం వట్టిపల్లి ప్రకాష్ శర్మ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, పరిషత్ కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# గల్లంతైన బాలయ్య ఆచూకీ కోసం ముమ్మర గాలింపు..

**స్వయంగా పర్యవేక్షించిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ!**

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 30 (జర్నలిస్ట్ డైరీ) :**
హాఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని వైశాలి నగర్ వద్ద ఉన్న రైల్వే అండర్ పాస్ వద్ద ప్రమాదవశాత్తు నాలా లో గల్లంతైన వ్యక్తి బాలయ్య(70) ఆచూకీ కోసం హాఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని రామకృష్ణ నగర్ కాలనీ లో కొనసాగుతున్న గాలింపు చర్యలో భాగంగా గౌరవ జోనల్ కమిషన్ శ్రీ నారాయణ్ అమిత్ మాలెం పాటి గారు, గౌరవ డీసీ శ్రీ శ్రీనివాస్ గారు, గౌరవ డీసీ శ్రీ సేవా ఇస్లావత్ గారు, గౌరవ టౌన్ ప్లానింగ్ ప్లానర్ శ్యామ్ మరియు సీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, హైడ్రా, పోలీస్, ట్రాఫిక్, ఎన్డీఆరఎఫ్, జలమండలి అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో స్వయంగా పరిశీలించిన ఆరెక పూడి గాంధీ గల్లంతైన వ్యక్తి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలను వేగవంతం చేయాలని పోలీసు, హైడ్రా, ఎన్డీఆరఎఫ్, సీఎంసీ , ఇంజనీరింగ్ విభాగం, జలమండలి అధికారులకు పలు సూచనలు.
గల్లంతయిన బాలయ్య భార్య ను మరియు కుటుంబసభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పిన ఆరెకపూడి గాంధీ.



ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ...వైశాలి నగర్ రైల్వే అండర్ పాస్ వద్ద ప్రమాదవశాత్తు మ్యాన్ హోల్ బాలయ్య జరిపడటం చాలా బాధారమైన విషయం అని, సంఘటన చాలా దురదృష్టకరం అని, గల్లంతైన వ్యక్తి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలను వేగవంతం చేయాలని పోలీసు, హైడ్రా,ఎన్డీఆరఎఫ్ , సీఎంసీ,ఇంజనీరింగ్ విభాగం, జలమండలి అధికారులకు తెలియచేసి పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగినది అని అర్ధరాత్రి రెండు గంటల వరకు నాలా ఔట్ లెట్ మరియు చెరువు ఇన్ లెట్ ఔట్ లెట్ లను క్షుణ్ణంగా స్వయంగా ప్రత్యక్షంగా దగ్గరుండి పరిశీలించడం జరిగినది అని తెలియచేశారు . గాలింపు చర్యలను ముమ్మరం చేశాం అని, అన్ని రకాల చర్యలు తీసుకున్నామని, ప్రతి మ్యాన్ హోల్ నుండి మ్యాన్ హోల్ వరకు క్షణంగా పరిశీలించడం జరిగినది అని, కెమెరాల ద్వారా క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుంది అని, అన్ని రకాల చర్యలు తీసుకున్నామని , ఆచూకీ కోసం అధికారులు అహర్నిశలు కృషి చేస్తున్నారు అని, వేగవంతంగా చేసి ఆచూకీ కనుకుంటామని, ఆచూకీ కోసం శాయశక్తుల కృషి చేస్తున్నామని, ఆచూకీ లభించే వరకు గాలింపు చర్యలను కొనసాగిస్తామని, మరింత ముమ్మరంగా గాలిస్తున్నామని తెలియచేశారు. వర్షాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని , అత్యవసరం తప్పితే బయటకు రాకూడదు అని, అధికారులు కూడా వర్షాకాలం ను దృష్టిలో పెట్టుకొని ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, పనులు జరుగుతున్న ప్రాంతాలలో రక్షణ చర్యలు చేపట్టాలని, నిర్లక్ష్యం వహించకూడదు అని తెలియచేశారు.
గల్లంతైన వ్యక్తి బాలయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కి ధైర్యంగా ఉండాలని , మీకు అన్ని విధాలుగా అండగా ఉంటానని, ప్రభుత్వం తరుపున అన్ని విధాలుగా సహాయం సహకారాలు అందేలా చూస్తానని, తన వంతు సహాయం ఎల్లవేళలో ఉంటుంది అని తెలియచేశారు.
ఈ కార్యక్రమంలో అధికారులు నాయకులు,కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బోనాల ఉత్సవాలు

**-మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**
**-ఫరూఖ్‌నగర్ యాదవ కాలనీ బోనాల ఊరేగింపులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, బీఆర్ఎస్ శ్రేణులు**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 30 (జర్నలిస్ట్ డైరీ) :**
షాద్‌నగర్ పట్టణంలోని ఫరూఖ్‌నగర్ యాదవ కాలనీలో నిర్వహించిన బోనాల ఊరేగింపులో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపులో భక్తులతో కలిసి పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల ఉత్సవాలను భక్తి, ఐక్యతతో నిర్వహించడం ఆనందదాయకమని ఆయన పేర్కొన్నారు. అమ్మవారి కరుణాకటాక్షాలు రాష్ట్ర, నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మండల అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, కౌన్సిలర్లు పిల్లి శారద శేఖర్, గోపాల్, ఎస్పీ శివ, మాజీ కౌన్సిలర్లు వెంకట్రాం రెడ్డి, యుగంధర్, చిన్న యాదగిరి, నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్, చీపిరి రవి యాదవ్, బిక్షపతి, చెర్క శివ, అశోక్, బాబా ఘోరీ, మహమూద్, నవీన్, సాయి, అభిలాష్, శ్రీనివాస్ తదితరులు, కాలనీ పెద్దలు, మహిళలు, యువకులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వర్షాలతో రైతులలో ఆనందం...!

**ఉమ్మడి వరంగల్ ,జూలై 30 (జర్నలిస్ట్ డైరీ) :**
ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆలస్యంగా కురుస్తున్న వర్షాలు రైతులకు సంతోషాన్ని కలిగించాయి. పత్తి ,మొక్కజొన్న, పెసరు కూరగాయల లాంటి పంటలకు మేలు జరుగుతుందని రైతులు ఆశాభావం చేశారు .వర్షం ఇలాగే కురిసినట్లయితే వరి సాగుకు అనుకూలమని, చెరువులు, కుంటలు, బోర్లలో నీటిమట్టం పెరిగే అవకాశం ఉండడంతో భూగర్భ జలాలు పెరుగుతాయని రైతులు పేర్కొన్నారు. వర్షాకాలంలో వర్షాలు రాకపోవడంతో రైతులు అనేక అవస్థలు పడ్డారు. ఆలస్యంగా నైనా గత రెండు ,మూడు రోజులుగా వర్షాలు రావడంతో మెట్ట పంట లకు అనుకూలంగా ఉందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.



# కన్నుల పండుగ శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం,అర్చన,పల్లకి సేవ..

**- శ్రవణ నక్షత్రం పురస్కరించుకొని జానంపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో కళ్యాణ మహోత్సవం.**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 30 (జర్నలిస్ట్ డైరీ) :**
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో జానంపేట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో ప్రతి నెల శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని నిర్వహించే కార్యక్రమాలలో భాగంగా,ఆషాడ మాసం పాడ్యమి గురువారము రోజున వెంకటేశ్వరస్వామి వారి కళ్యాణం అంగర వంగ వైభవంగా నిర్వహించిన వేద బ్రాహ్మణోత్తములు,స్వామి వారి కళ్యాణంలో పాల్గొన్న పాలది విజయనిర్మల శివకుమార్, జ్యోతి గంగాధర్, భాగ్యరేఖ భూపాల్ రెడ్డి, సుమతి సురేందర్ రెడ్డి దంపతులు.. కల్యాణ మహోత్సవంలో షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే టిడిపి పోలీట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు, పుర ప్రముఖులు సాయిశ్వర్ రెడ్డి,బార్ కౌన్సిల్ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి, 16వ వార్డ్ కౌన్సిలర్ఒగ్గు జయలక్ష్మి కిషోర్,రాంభూపాల్,బాలరాజ్,కల్వ సతీష్, ప్రవీణ్, వందలాది సంఖ్యలో భక్తులు పాల్గొని ఆధ్యాంతం శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని వీక్షించి,పల్లకి సేవలో పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు.

# వీరాశైవ మహిళా సమాజం ఆధ్వర్యంలో ఘనంగా గోరింటాకు కార్యక్రమం

**షాద్‌నగర్ వీరాశైవ లింగాయత్ భవనంలో మహిళల సందడి**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 30 (జర్నలిస్ట్ డైరీ) :**
షాద్‌నగర్ పట్టణ వీరాశైవ మహిళా సమాజం ఆధ్వర్యంలో గురువారం వీరాశైవ లింగాయత్ భవనంలో గోరింటాకు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సమాజం అధ్యక్షురాలు పట్వారి వినీత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయబద్ధంగా గోరింటాకు పెట్టించుకుని ఆనందోత్సాహాల మధ్య వేడుకను జరుపుకున్నారు.ఈ సందర్భంగా మహిళలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ వీరాశైవ సంప్రదాయాలు, సంస్కృతిని భావితరాలకు అందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ముఖ్యమైనవని పేర్కొన్నారు. మహిళల ఐక్యతను, సాంస్కృతిక విలువలను పెంపొందించే వేదికగా ఈ కార్యక్రమం నిలిచిందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పత్తిగిరి మాధవి, మున్సిపల్ చైర్మన్ సతీమణి అగ్గనూర్ జగదేవి, గౌరవ అధ్యక్షురాలు తెరుపల్లి దేవి, కోశాధికారి వెన్నె అరుణ, పట్నంశెట్టి సంధ్య, రేటికల్ విశాల, శార్వాణి, మాజీ కౌన్సిలర్ రేటికల్ మీనా, గీత, ఆకుల సరిత, ఉడుకుల్ల లత, సుమతి, రాజేశ్వరి, సుంకు స్వరూప, బొబ్బిలి శ్రీదేవి, దీప, శ్రీలత, పార్వతితో పాటు వీరాశైవ మహిళా సమాజం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్‌పై బీజేపీ నేతలు ఉద్యమంలోకి రావాలి

**-అందె బాబయ్య, నెల్లి శ్రీవర్ధన్ రెడ్డికి అభినందనలు తెలిపిన రాజా వరప్రసాద్**

**-ప్రభుత్వంపై పోరాటంలో అన్ని రాజకీయ పార్టీలు ఏకం కావాలని పిలుపు**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 30 (జర్నలిస్ట్ డైరీ) :**
సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ అంశంపై జాతీయ ఎస్సీ కమిషన్ స్పందించి రాష్ట్ర ప్రభుత్వాన్ని నివేదిక కోరడం స్వాగతించదగ్గ పరిణామమని తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ మాజీ చైర్మన్ రాజా వరప్రసాద్ అన్నారు. ఈ విషయంలో రైతులకు అండగా నిలిచి, వారిని ఢిల్లీకి తీసుకెళ్లి జాతీయ ఎస్సీ కమిషన్ దృష్టికి సమస్యను తీసుకెళ్లిన బీజేపీ షాద్‌నగర్ సీనియర్ నాయకులు అందె బాబయ్య, నెల్లి శ్రీవర్ధన్ రెడ్డిలకు ఆయన శుభాభినందనలు తెలిపారు. అయితే, డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు కారణమైన జి.వో. నం.641ను కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిందని పేర్కొంటూనే, జాతీయ స్థాయిలో "కాంగ్రెస్ ముక్త్ భారత్" అనే నినాదం ఇచ్చే బీజేపీ, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై అదే స్థాయిలో ఎందుకు పోరాటం చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. అలాగే, సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేకంగా జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉద్యమ కార్యక్రమాల్లో పాల్గొనవద్దని స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ జిల్లా అధ్యక్షుడు సూచించారనే ప్రచారం నిజమేనా అని ప్రశ్నించారు.ఏదేమైనా, సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ రద్దు దిశగా ఒక కీలక ముందడుగు పడేందుకు కృషి చేసిన అందె బాబయ్య, నెల్లి శ్రీవర్ధన్ రెడ్డిలను మరోసారి అభినందిస్తున్నానని, ఇకపై డంపింగ్ యార్డ్ వ్యతిరేక ఉద్యమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యక్షంగా పాల్గొని రైతులకు అండగా నిలవాలని రాజా వరప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

# "మట్టిగోడల నుండి మహానగరం దాకా" డాక్టర్ తిప్పర్తి యాదయ్య ప్రస్థానం...

**జర్నలిస్టు డైరీ హైదరాబాద్ :**
గొప్పింట్లో పుట్టిన వారందరూ గొప్పవారు కారు. పేదింట్లో పుట్టిన వారందరూ పేదలు గ ఉండరు . అవరోధాలను సవాలుగా తీసుకొని అవకాశాలను అనుకూలంగా మార్చుకొని ముందుకెళ్లినవారే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారు. అందుకు డాక్టర్ తిప్పర్తి యాదయ్య జీవిత ప్రస్థానం ఒక చక్కటి ఉదాహరణ. మారుమూల పల్లెలో పుట్టి మహానగరంలో ఉద్యోగంలో మణి మాణిక్యంలా వెలిగి జూలై,31న పదవీ విరమణ చేయనున్న ఆయన ఎందరికో ఆదర్శప్రాయుడు.నల్లగొండ జిల్లా చండూరు మండలం దోనిపాముల పల్లెలో తోలు శుభ్రం చేసే తిప్పర్తి అంతయ్య మనుమడిగా, కమ్యూనిస్టు కొండయ్య కొడుకుగా, మట్టిగోడల పాఠశాలలో చింపిరి జుట్టుతో, చిరిగిన బట్టలతో అక్షరాభ్యాసం చేసి ఓనమాలు దిద్దుతూ ముచ్చటగా మూడో తరగతి వరకు చదివి, ఆపై ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న బంగారిగడ్డకు నాలుగో తరగతి చదువుకు లేత వయసులో తండ్రి కష్టమై వారించినా తాత ప్రోత్సాహంతో నడకతో నడుం బిగించి ప్రయాణమయ్యాడు. బంగారిగడ్డలో ఎనిమిదో తరగతి లేకపోవడంతో వెనక్కి రమ్మన్న తండ్రికి, తాను భారం కారాదని భావించి హాస్టల్ చదువుకు నల్లగొండకు ప్రయాణమైతే హాస్టల్ సీటు దొరకక దిక్కుతోచని స్థితిలో ఉన్నప్పుడు, తాత సూచనతో భారత కమ్యూనిస్టు పార్టీ ఆఫీసులో ఉంటూ కట్టెల పొయ్యిపై వంట చేసుకుంటూ, కంపతుమ్మ కట్టెలు కొట్టుకొచ్చుకొని వంట చేసుకుంటూ, డబ్బులు లేక రాత్రిళ్లు రైస్‌మిల్లులో బస్తా బియ్యం నింపితే రూపాయి చొప్పున సంపాదించుకుంటూ చదువు కొనసాగించి మెట్రిక్యులేషన్ దాటాడు.డాక్టర్ కావాలనే కోరికతో ఇంటర్ బైపీసీ చదివితే సీటు రాక నల్లగొండ నాగార్జున కళాశాలలో బీఎస్సీలో చేరి విద్యార్థి దశలో రాడికల్ విద్యార్థి సంఘంలో, అటుపిమ్మట ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘంలో రాష్ట్ర స్థాయి వరకు పనిచేసి సామ్యవాద భావాలు పుణికిపుచ్చుకున్నాడు. డిగ్రీ మధ్యలోనే వదిలేసి పూర్తి స్థాయి విద్యార్థి ఫెడరేషన్ ,యువజన సమాఖ్య నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నప్పుడు విద్యార్థి సంఘ నాయకురాలిగా ఉన్న వట్టేపు సౌజన్యతో పరిచయమై భావాలు కలిసిన బంధం ఏర్పడి, ఒకరినొకరు పెద్దలను ఒప్పించి 1984లో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కమ్యూనిస్టు పార్టీ నల్లగొండ పార్లమెంట్ సభ్యుడు కామ్రేడ్ ధర్మభిక్షం గారి ఆధ్వర్యంలో ఆదర్శ వివాహం



చేసుకున్నాడు. వారికి ప్రియ శిష్యుడు గా కొనసాగినాడు వీరికి ముగ్గురు సంతానం.

1991 డిసెంబర్ లో హెల్త్ అసిస్టెంట్ ఉద్యోగం రావడంతో ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైంది. తన భార్యకు కూడా అప్పుడే ఉద్యోగం వస్తే ఒకే ఇంటిలో ఇద్దరికీ ప్రభుత్వ ఉద్యోగం వల్ల మరో నిరుద్యోగికి నష్టమని భావించి ఇద్దరి అంగీకారంతో అర్ధాంగి ఉద్యోగాన్ని తిరస్కరించిన ఆదర్శ దంపతులు. 1994లో ఎంఆర్‌పీఎస్ ఏర్పడినప్పుడు నల్లగొండ జిల్లా సమన్వయకర్తగా పనిచేస్తూనే, ఉద్యోగం నిబద్ధతతో చేయడం వల్ల అగ్రవర్ణాల పైరవీకారులకు పనిలేక కక్షగట్టి తాండూరుకు బదిలీ చేయించారు. తాండూరులో పనిచేస్తూ షాబాద్ బండల క్వారీల్లో పనిచేసే పిల్లలకు తాను స్వయంగా ట్యూషన్లు ఏర్పాటు చేసి చదివించగా పదో తరగతి ఫలితాలను చూసి ఆశ్చర్యపోయిన ఆనాటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అజయ్ జైన్ అభినందించి ప్రశంసాపత్రం ఇచ్చారు. "ఈ సందర్భంగా పరిశీలనకు వచ్చిన ధర్మబికషమ గారికి అభినందన సభ జరిపినారు మీరెంత తిన్నా మా పిల్లలకు మాత్రం కడుపునిండా భోజనం పెట్టండి" అని హాస్టల్ వార్డెన్లను ప్రాధేయపడితే వార్డెన్లే సంభ్రమాశ్చర్యానికి లోనైన సందర్భాలెన్నో ఉన్నాయి.ఒకవైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు దూరవిద్య ద్వారా తన ఉన్నత విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. ఉస్మానియా యూనివర్సిటీ నుండి ఎంఏ సోషియాలజీ పూర్తిచేసి అనంతరం "హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల మురికివాడల నివాసితులలో ఆరోగ్య అవగాహన పద్ధతులు" అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా అందుకున్నారు.

2002లో హైదరాబాద్‌కు బదిలీ కాగానే అప్పుడప్పుడే మలిదశ తెలంగాణ ఉద్యమం ఊపందుకుంటున్నది. ఉద్యోగంతో పాటుగా ఉద్యమ బాధ్యతలు తోడైనవి. తెలంగాణ ఉద్యోగుల సంఘాలతో కలిసి పనిచేస్తూనే, మున్సిపల్ శాఖలో తెలంగాణ మున్సిపల్ కార్మిక ఉద్యోగుల సంఘం ఏర్పాటు చేసి పదవీ విరమణ నాటికి అధ్యక్షుడిగా సేవలందించారు. తెలంగాణ విద్యావంతుల వేదిక ప్రధాన కార్యదర్శిగా, తెలంగాణ మున్సిపల్ ఉద్యోగుల, కార్మికుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. సకల జనుల సమ్మె పిలుపు మేరకు తన ఉద్యోగం ఊడిపోతుందని తోటివారు వారించినా ఆనాటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ఇంటి ముందు మున్సిపల్ వాహనాల ద్వారా చెత్త పోసి నిరసన తెలిపారు. ప్రధాన కార్యాలయంలో నిరంతర ఉద్యమ కార్యక్రమాలు నిర్వహించారు.

ఐక్యరాజ్యసమితిలో భాగమైన ప్రపంచ శాంతి సంఘం అనుబంధమైన అఖిల భారత శాంతి మరియు సంఘీభావ సంఘానికి జాతీయ ఉపాధ్యక్షుడిగా అనేక దేశాలలో జరిగిన శాంతి సమావేశాల్లో భారత ప్రతినిధిగా పాల్గొన్నారు. 2005 మరియు 2010లో సమర్థవంతమైన అధికారిగా రాష్ట్ర ప్రభుత్వం చేత అవార్డులు అందుకున్నారు. ఇందిరా గాంధీ జాతీయ సమైక్యత అవార్డు, భారతీయ దళిత సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీచే 2016లో సేవారత్న అవార్డు, 2017లో అఖిల భారత శాంతి సంఘీభావ అవార్డు, మరెన్నో ప్రశంసలు అందుకున్నారు అనేక సామాజిక సంస్థల్లో దళిత చైతన్య ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు.

నక్సల్బరి గర్జనకు ఏడాది ముందు జల్లుల జడివానలు కురిసే గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసంలో జన్మించి, తొలి పండుగ రక్షాబంధన్‌తో స్నేహ సంబంధాలను పుణికిపుచ్చుకొని హైదరాబాద్ అందరివాడుగా ఆత్మీయంగా పిలిపించుకునే డాక్టర్ తిప్పర్తి యాదయ్య అందరికీ మంచి మిత్రుడు, అంతకుమించి ఎందరికో ఆత్మీయుడు. మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ లో జూలై,31న సెలక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ ( జిహెచ్ఎంసి లో జాయింట్ కమిషనర్) హోదాలో పదవీ విరమణ చేయుచున్న డాక్టర్ తిప్పర్తి యాదయ్య అభ్యుదయ , వామపక్ష ,దళిత ఉద్యమాలకు మంచి మార్గదర్శకుడు.

– మహేశ్ తిప్పర్తి , మాజీ ప్రధాన కార్యదర్శి,ఏ ఐ ఎస్ ఎఫ్ నల్లగొండ జిల్లా

# సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ అంశంపై జాతీయ ఎస్సీ కమిషన్ సీరియస్

**-తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అత్యవసర ఆదేశాలు**

**-15 రోజుల్లో చర్యల నివేదిక సమర్పించాలని ఆదేశించిన జాతీయ ఎస్సీ కమిషన్**

**- రైతుల తరపున ఢిల్లీ వరకు పోరాటం చేసిన షాద్ నగర్ బీజేపీ నేతల చొరవ ఫలితం**

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 30 (జర్నలిస్ట్ డైరీ) :**
రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండలం సిద్ధాపూర్ గ్రామంలో ప్రతిపాదిత జీహెచ్ఎంసీ ఘన వ్యర్థాల నిర్వహణ (ఎాఔవీ) కేంద్రం ఏర్పాటుపై జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ (చీజూజ) స్పందించింది. సిద్ధాపూర్ గ్రామానికి చెందిన పట్నం సురేష్ సమర్పించిన ఫిర్యాదును పరిశీలించిన కమిషన్, ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూకు అధికారిక లేఖ పంపింది.




ఫిర్యాదులో పేర్కొన్న అంశాల ప్రకారం, ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ వల్ల షెడ్యూల్డ్ కులాల కుటుంబాలు, చిన్న రైతుల భూములు, జీవనోపాధి, ఆరోగ్యం, రాజ్యాంగ హక్కులు దెబ్బతినే అవకాశం ఉందని కమిషన్ పేర్కొంది. ఈ అంశం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 పరిధిలోకి వస్తుందని స్పష్టం చేసింది. జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామ్‌చందర్ సంతకంతో జారీ చేసిన లేఖలో, సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే విచారణ అనంతరం తీసుకున్న చర్యలు, సంబంధిత ఆధారాలతో కూడిన యాక్షన్ టేకెన్ రిపోర్ట్ (ఏటీఆర్)ను 15 రోజుల్లోగా కమిషన్‌కు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు.

**- బీజేపీ నేతల చొరవతో ఢిల్లీ వరకు రైతుల పోరాటం**

సిద్ధాపూర్ రైతుల సమస్యను జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో బీజేపీ షాద్‌నగర్ సీనియర్ నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందే బాబయ్య కీలక పాత్ర పోషించారు. రైతులకు అండగా నిలిచి, వారిని ఢిల్లీకి తీసుకెళ్లి జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులను కలిసి సమస్యను వివరించేలా సహకరించారు. వారి చొరవ, సమన్వయం ఫలితంగానే కమిషన్ వెంటనే స్పందించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక కోరడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ లేఖ ప్రతులను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రధాన కార్యదర్శి, జీహెచ్ఎంసీ కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శికి కూడా పంపినట్లు లేఖలో పేర్కొన్నారు.సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ అంశం ఇప్పుడు జాతీయ స్థాయిలో చర్చకు రావడంతో, ప్రభుత్వం తీసుకోనున్న తదుపరి చర్యలపై రైతులు, గ్రామస్తులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు..

# నాగోల్ పీఎస్‌కు ఇద్దరు ఎస్సైలు

**నాగోల్, జులై30 (జర్నలిస్ట్ డైరీ) :**
నాగోల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చిన సబ్ ఇన్‌స్పెక్టర్లు సూర్య నాయక్, మమతారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ సమక్షంలో వారు రిపోర్ట్ చేయగా, విధుల బాధ్యతలను అప్పగించారు. 2014 బ్యాచ్‌కు చెందిన సూర్య నాయక్ గతంలో చిక్కడపల్లి, బేగంపేట, తిరుమలగిరి, హయత్‌నగర్ పోలీస్ స్టేషన్లతో పాటు మల్కాజిగిరి ట్రాఫిక్ విభాగంలో విధులు నిర్వహించారు. రోడ్డు భద్రత విభాగానికి బదిలీ అయిన ఎస్సై వేణుగోపాల్ స్థానంలో 2024 బ్యాచ్‌కు చెందిన మమతారెడ్డి జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ నుంచి నాగోల్‌కు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇద్దరు అధికారులను సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ అభినందించి, ప్రజలకు మెరుగైన



పోలీసు సేవలు అందించేలా విధులు నిర్వహించాలని సూచించారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# చేనేత సంఘాలను ప్రభుత్వం బలోపేతం చేయాలి

**చిట్యాల జులై 30 (జర్నలిస్ట్ డైరీ) :** ఆగస్టు 4న హైదరాబాద్, ఆటోనగర్ లోని కర్నాటి గార్డెన్స్‌లో తెలంగాణ చేనేత సహకార సంఘాల అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులతో సదస్సును నిర్వహించనున్నట్లు తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళిధర్ తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సహకార సంఘాల అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు పెద్దఎత్తున హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. పాలకవర్గాలను ఘనంగా సన్మానించి సొసైటీలకు మెమెంటోలు అందివ్వనున్నట్లు తెలిపారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు గత 13 సంవత్సరాలుగా చేనేత సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదని, తెలంగాణ చేనేత కార్మిక సంఘం ప్రభుత్వం పై ఒత్తిడి చేయడంతో ఎన్నికలు జరిపిందని గుర్తు చేశారు. సొసైటీలలో ఉన్న పాత అప్పులను ప్రభుత్వాలు ఇప్పటివరకు పూర్తిగా మాఫీ చేయలేదని విమర్శించారు. చేనేత సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాలు రాష్ట్రవ్యాప్తంగా కనీసం రూ.30 కోట్లు కూడా ఉండవని, రైతులు, ఇతర వ్యాపారుల మాదిరిగానే చేనేత సంఘాల రూ.30 కోట్ల రుణాలను కూడా ప్రభుత్వం పూర్తిగా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ ఐఏఎస్ ఆఫీసర్ వెంకటేశం హాజరై సహకార సంఘాల చట్టాలపై, నిర్వహణపై



సభ్యులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ సదస్సుకు సహకార సంఘాల నాయకులు, కార్మికులు అందరూ కలిసికట్టుగా వచ్చి సద్వినియోగం చేసుకోవాలని గంజి మురళీధర్ విజ్ఞప్తి చేశారు. చేనేత సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాలను మాఫీ చేయడంతో పాటు, త్రిఫ్ట్ ఫండ్ డబ్బులను వెంటనే బ్యాంకుల ద్వారా విడుదల చేయాలని కోరారు. టెస్కో ద్వారా బెస్ట్ మెటీరియల్స్, బెడ్‌షీట్లు, టవల్స్ తదితర వస్త్రాలను టెండర్లను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించవద్దని దీనివల్ల చేనేత సహకార సంఘాల సభ్యులకు ఉపాధి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిబంధనను ప్రభుత్వం విరమించుకొని హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ సంస్థల విద్యార్థులకు అందాల్సిన చేనేత వస్త్రాల ఆర్డర్లను వెంటనే నేరుగా చేనేత సొసైటీలకే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆ రోజున చేనేత సంఘాల క్యాష్ క్రెడిట్ రుణమాఫీని ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చేనేత సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
ఏకగ్రీవంగా ఎన్నికైన చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం ప్రత్యేక గ్రాంటును ప్రకటించాలని ఆయనకోరారు. ఈకార్యక్రమంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కందగట్ల గణేష్, చిట్యాల చేనేత సహకార సంఘం అధ్యక్షులు గంజి సుధాకర్, ప్రధాన కార్యదర్శి చెరుపల్లి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు మిర్యాల వెంకటేశ్వర్లు, కోశాధికారి కోట రాంబాబు, డైరెక్టర్లు వడ్డేపల్లి రాములు పాల్గొన్నారు.

# ఆగస్టు 2న జరిగే ఏఐటీయూసీ జిల్లా నాలుగవ మహాసభను విజయవంతం చేయండి

**- జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు**

**ఇబ్రహీంపట్నం జులై 30 (జర్నలిస్ట్ డైరీ) :** ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్( ఏఐటియుసి ) రంగారెడ్డి జిల్లా నాలుగోవ మహాసభ ఆగస్టు 2న తుక్కుగూడలోని ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్ హాలులో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని ఈ మహాసభకు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్ సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య. Aituc.రాష్ట్ర ఉపాధ్యక్షులు బి చంద్రయ్య లు హాజరవుతున్నారని పర్వతాలు తెలిపారు. జిల్లాలో ఏఐటీయూసీ విస్తరణకు భవిష్యత్తు ఉద్యమాలకు కార్మికుల సమస్యలు, కార్మికులకు వైద్య సదుపాయాల కోసం జిల్లా కేంద్రంగా ఈఎస్ఐ హాస్పిటల్ నియమించాలి, వలస కార్మికుల సమస్యల పై మహాసభలో చర్చించి నిర్ణయాలు చేస్తామని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్తు పోరాటాలకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు.



కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలుపై ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి. దత్తు నాయక్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి జిల్లా కార్యదర్శి కే చందుయాదవ్ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్ పి. దేవేందర్ గౌడ్, కొమ్మ గళ్ళ రాజు యాదగిరి, శివ అప్సర్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయాలి

**- పీఐబీ ఏడీజీ శ్రీమతి శృతి పాటిల్**
**- పీఐబీ ఆధ్వర్యంలో 'వార్త' వర్క్‌షాప్**
**-హాజరైన కేంద్ర ప్రభుత్వ విభాగాల అధికారులు**

**హైదరాబాద్ జులై 30 (జర్నలిస్ట్ డైరీ) :** కేంద్ర ప్రభుత్వ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) అడిషనల్ డైరెక్టర్ జనరల్ శ్రీమతి శృతి పాటిల్ పేర్కొన్నారు. గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలపై గురువారం కవాడిగూడలోని సీజీవో టవర్స్‌లో పీఐబీ 'వార్త' వర్క్‌షాప్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ఇంటర్ మీడియా పబ్లిసిటీ కోఆర్డినేషన్ కమిటీ(ఐఎంపీసీసీ)లో భాగంగా ఉన్న వివిధ కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థలు(పీఎస్‌యూ)లకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. తమ శాఖల పరిధిలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను, గత 12 సంవత్సరాల్లో సాధించిన ముఖ్య విజయాలను వివరించారు. ప్రజలకు మరింత



సమర్థవంతంగా చేరువయ్యేందుకు భవిష్యత్తులో చేపట్టాల్సిన ప్రచార కార్యక్రమాలు, మీడియా ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన చర్యలపై వారు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా పీఐబీ విధులు, కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపడుతున్న కార్యక్రమాల గురించి అడిషనల్ డైరెక్టర్ జనరల్ శ్రీమతి శృతి పాటిల్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలకు ప్రచార కార్యక్రమాలపై సహకారం అందించేందుకు పీఐబీ ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు, పథకాలను ఎక్కువ మంది ప్రజలకు చేరువ చేసి, వారు లబ్ధి పొందేలా చూడటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల ఉన్నతాధికారులు, పీఐబీ, సీబీసీ అధికారులు పాల్గొన్నారు.

## ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ లో ప్రభుత్వ బిక్ష కాదు విద్యార్థుల హక్కు బీజేవైఎం



**చండూర్ జులై 30 (జర్నలిస్ట్ డైరీ) :** ఫీజుల బకాయి బిజెపి లడాయి అనే నినాదంతో చండూరు మండల కేంద్రంలో బీజేవైఎం రాష్ట్ర నాయకులు పేర్ల గణేష్ ఆధ్వర్యంలో డాన్ బోస్కో జూనియర్ కళాశాలలో ఫీజు రీయింబర్స్మెంట్ మరియు స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థుల సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేవైఎం జిల్లా అధ్యక్షులు కంబాలపల్లి సతీష్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.15,000 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేద, బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్తును ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని తీవ్రంగా మండిపడ్డారు. అదేవిధంగా ఫీజులు చెల్లించకపోవడం వల్ల విద్యార్థులకు చదువు పూర్తయ్యాక సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యాసంస్థల యాజమాన్యాలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయని అన్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకునిరేత్తి నట్టు వ్యవహరిస్తే విద్యార్థులతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చెప్పడతామని హెచ్చరించారు. వెంటనే బకాయిలు చెల్లించకపోతే ఎమ్మెల్యే లను , మంత్రులను ప్రజల్లో తిరగనివ్వమని, వారి ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు జిల్లా నాయకులు పబ్బు వంశీ,సుగుణాచారి,సాయి చందు,రాజు, గణేష్ సాయి ప్రదీప్ భరత్ రాజేష్ శివ క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు

## కలెక్టర్ చేతుల మీదుగా వృద్ధుల కోసం 'ప్రణామ్' ప్రారంభం




**హైదరాబాద్, జూలై 30 (జర్నలిస్ట్ డైరీ) :** వృద్ధులకు వ్యక్తిగత ఆరోగ్య సేవలు అందించేందుకు అస్టర్, కేర్ హాస్పిటల్స్ సంయుక్తంగా 'ప్రణామ్' కార్యక్రమాన్ని ప్రారంభించాయి. హైదరాబాద్‌లోని కేర్ హాస్పిటల్స్‌లో జరిగిన కార్యక్రమాన్ని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక అల, ఐఏఎస్ ప్రారంభించగా, లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ నరసింహరాజు దిచ్‌పల్లి పాల్గొన్నారు. కార్యక్రమంలో అస్టర్ డీఎం క్వాలిటీ కేర్(ఇండియా-2) సీఈఓ డా.పవన్ కుమార్, శలభ్ డాంగ్, వైభవ్ జోషి, డా.అమిత్ సింగ్, నీలేశ్ గుప్తా, డా.విన్సీ అశోక్ త్రిభువన్ పాల్గొన్నారు. తెలంగాణలోని అన్ని అస్టర్, కేర్ హాస్పిటల్స్‌లో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో వృద్ధులకు ప్రాధాన్య వైద్య సేవలు, హెల్ప్‌లైన్, ఫాలోఅప్, హెల్త్ చెకప్‌లు, చైర్ యోగా, వాకింగ్ గ్రూపులు తదితర సేవలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఫీజుల బకాయి బీజేపీ లడాయి





**ఇబ్రహీంపట్నం జులై 30 (జర్నలిస్ట్ డైరీ) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ?15,000 కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయడంలో నిర్లక్ష్యం వహిస్తూ లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న తీరును తీవ్రంగా ఖండిస్తూ, బీజేపీ యువ మోర్చా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ కుండే గణేష్ పిలుపు మేరకు ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ దత్త ఇంజనీరింగ్ కళాశాలలో "ఫీజుల బకాయి -- బీజేపీ లడాయి" కార్యక్రమాన్ని సుమారు 1,000 మంది విద్యార్థుల పాల్గొనికతో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీ వన్నవాడ రవీందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ, వెంటనే ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బకాయిల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వేలాది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వందలాది విద్యాసంస్థలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకులు పుప్పాల శాంతి కుమార్, బీజేవైఎం మున్సిపల్ అధ్యక్షులు కంబాలపల్లి శశిధర్ రెడ్డి, ఆదిభట్ల మున్సిపల్ అధ్యక్షులు వినయ్, శ్రీకాంత్, సందీప్, సంతోష్, టిల్లు, అర్జున్ గారితో పాటు బీజేవైఎం జిల్లా, మండల నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# బిజినెస్

## బీమా రంగంలోకి పతంజలి





న్యూఢిల్లీ,
బాబా రామ్‌దేవ్‌నకు చెందిన ఎఫ్ఎంసీజీ సంస్థ పతంజలి ఆయుర్వేద గ్రూపు తాజాగా బీమా రంగంలోకి అడుగుపెట్టడానికి సిద్ధమైంది. ప్రస్తుతం ఎఫ్ఎంసీజీ, ఆయుర్వేద ఉత్పత్తులను విక్రయిస్తున్న సంస్థ..జనరల్ ఇన్సూరెన్స్ విభాగంలోకి అడుగుపెట్టడానికి మార్గం సుగమమైంది. ఇందుకు సంబంధించి మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలో మెజారిటీ వాటా కొనుగోలు ప్రతిపాదనకు బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.ఈ ఒప్పందం ప్రకారం పతంజలి ఆయుర్వేదకు మాగ్మా ఇన్సూరెన్స్‌లో 73.56 శాతం వాటా దక్కనుండగా, డీఎస్ గ్రూపునకు 24.5 శాతం వాటా దక్కనున్నది. వచ్చే మూడు నెలల్లో పూర్తికానున్న ఈ ఒప్పందం విలువ రూ.4,500 కోట్ల స్థాయిలో ఉన్నట్టు అంచనా. ప్రస్తుతం మాగ్మా ఇన్సూరెన్స్ కంపెనీ మోటార్, హెల్త్, ప్రాపర్టీ, కమర్షియల్ ఇన్సూరెన్స్ ఉత్పత్తులను విక్రయిస్తున్నది.

### లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్..

## సెన్సెక్స్ 273 పాయింట్లు లాభం

భారతీయ స్టాక్ మార్కెట్లు గురువారం లాభాల్లో ముగిశాయి. వరుసగా రెండో రోజూ మార్కెట్ లాభాల్లో ముగియడం విశేషం. బీఎస్ఈ సెన్సెక్స్ 273 పాయింట్లు లాభపడగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 66 పాయింట్లు లాభపడింది. ట్రేడింగ్ చివర్లో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు పాల్పడటం, ప్రస్తుతానికి వడ్డీ రేట్లు పెంపు లేకున్నా సెప్టెంబర్‌లో వడ్డీ రేట్ల పెంపు ఉంటుందని అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ప్రకటించడం మార్కెట్‌కు కలిసొచ్చింది.బీఎస్ఈ సెన్సెక్స్ గురువారం ఉదయం లాభాల్లోనే ప్రారంభమైంది. రోజులో ఒక దశలో 78,007.09 పాయింట్ల గరిష్ఠ స్థాయికి చేరగా, 77,440.91 పాయింట్ల కనిష్ఠ స్థాయిని చూసింది. చివరకు 273.55 పాయింట్లు (0.35 శాతం) లాభంతో 77,928.15 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ 50 షేర్ నిఫ్టీ కూడా 66.95 పాయింట్ల లాభంతో 24,317.15 వద్ద ముగిసింది. అయితే, బీఎస్ఈ



మిడ్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ 67.50 పాయింట్లు నష్టపోయింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ కూడా 57.82 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ ఐటీ, నిఫ్టీ మెటల్ షేర్లు లాభాలు చవిచూశాయి. అందులో నిఫ్టీ ఆటో షేర్లు 1.63 శాతం పెరిగాయి. బీఎస్ఈ 30 ఇండెక్స్‌లో మహీంద్రా అండ్ మహీంద్రా, పవర్ గ్రిడ్, టెక్ మహీంద్రా, మారుతి, రిలయన్స్ భారీగా లాభపడ్డాయి. అందులో ఎం అండ్ ఎం 2.01 శాతం లాభాలు పొందింది. అదానీ పోర్ట్స్, బీఈఎల్, ఇండిగో, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. వీటిలో అదానీ పోర్ట్స్ షేర్లు 3.46 శాతం నష్టపోయాయి. అంతర్జాతీయంగా ఒడుదొడుకులు ఎదురవుతున్నప్పటికీ భారతీయ మార్కెట్లు నిలకడగా రాణిస్తున్నాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడాయిల్ ధర పెరిగింది. బ్యారెల్‌కు 90 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 95.67 వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,068.45 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## బీహెచ్ఈఎల్‌కు రూ 2,500 కోట్ల ఆర్డర్

**రామచంద్రాపురం, జూలై 30**
విద్యుత్ పరికరాల తయారీలో అగ్రగామి సంస్థయైన భెల్ మరో భారీ ఆర్డర్‌ను చేజిక్కించుకున్నది. నైజీరియా నుంచి ఎనిమిది గ్యాస్ టర్బైన్ జనరేటర్ల ప్రతిష్ఠాత్మక ఆర్డర్ లభించిందని, దీని విలువ రూ.2,500 కోట్ల స్థాయిలో ఉంటుందని కంపెనీ ఈడీ శ్రీనివాసరావు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో తీవ్రమైన పోటీ మధ్య ఈ ఆర్డర్ దక్కించుకోవడం సంతోషంగా ఉన్నదన్నారు.ఈ ఆర్డర్‌లో భాగంగా ఎనిమిది గ్యాస్ టర్బైన్ జనరేటర్ రూపకల్పన, తయారీ, సరఫరాతోపాటు ప్రాజెక్టు కార్యకలాపాలు నిర్వహించాల్సివుంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ జనరేటర్ పరికరాలను హైదరాబాద్‌తోపాటు బెంగళూరులో ఉన్న ప్లాంట్లో తయారు చేస్తున్నట్టు చెప్పారు.

BHEL

## అంతర్జాతీయ క్రికెట్‌కు రహానే వీడ్కోలు


# స్పోర్ట్స్

### నిస్వార్థ సేవకుడు.. ఆట ముగించాడు!..

ఆస్ట్రేలియాతో ప్రతిష్టాత్మక బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ (2020–21)ని గెలిచి స్వదేశానికి చేరుకున్నాక ముంబైలో కొంతమంది అభిమానులు రహానే ఇంటివద్ద కంగారూ బొమ్మతో ఉన్న ఒక ప్రత్యేకమైన కేక్‌ను తయారుచేయించి దానిని కట్ చేయాలని కోరారు. అప్పుడతడు ఆ బొమ్మను తొలగిస్తేనే కట్ చేస్తానని చెప్పడంతో అక్కడున్నవారంతా ఆశ్చర్యానికి గురయ్యారు. తాము గెలిచింది ఆటలో కానీ ఆ దేశానికి గర్వకారణమైన జాతీయ జంతువును అగౌరవపరచడం తమ అభిమతం కాదని అతడు చెప్పకనే చెప్పాడు. రహానే వ్యక్తిత్వం గురించి చెప్పడానికి ఇంతకన్నా ఉదాహరణలు అవసరం లేదు. భావోద్వేగాలకు నిలయమైన క్రికెట్‌లో ఎక్కడా తన ప్రశాంతతను కోల్పోకుండా తన తోటి ఆటగాళ్లకే గాక ప్రత్యర్థులనూ నొప్పించకుండా ఆటలో వారితోనే శభాష్ అనిపించుకున్న అతికొద్దిమంది గొప్ప క్రికెటర్లలో రహానే ఒకడు

ఈ ముంబై క్రికెటర్ గురువారం తన అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ వీడియో రిలీజ్ చేస్తూ... 'నా కెరీర్‌లో స్వార్థం చూసుకోకుండా ఎల్లప్పుడూ నా దేశం, జట్టు ప్రయోజనాలకే మొదటి ప్రాధాన్యం ఇచ్చాను. పూర్తి నిజాయితీతో ఈ ఆట ఆడాను.అజింక్యా అంటే ఓటమి లేనివాడని అర్థం. కానీ క్రికెట్ నాకు ఎన్నోసార్లు ఓటములను చూపించింది. క్రీడాకారులుగా మేము సాధించే విజయాల కంటే పొందే వైఫల్యాలే ఎక్కువ. నా జట్టు మ్యాచ్‌లు ఓడింది, నేనూ తప్పులు చేశాను. కానీ అభిమానుల హృదయాల్లో నేను ఎప్పుడూ ఓడిపోలేదు' అని కన్నీటితో చెప్పాడు. 2011 నుంచి 2023 దాకా జాతీయ జట్టుకు ప్రాతినిథ్యం వహించిన రహానే.. 85 టెస్టులు, 90 వన్డేలు, 20 టీ20లు ఆడాడు.

**ఆ సిరీస్ ప్రత్యేకం**
అది 2020–21 బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ. ఆడేది ఆస్ట్రేలియా సొంతగడ్డపై.. తొలి టెస్టు జరిగిన అడిలైడ్‌లో కంగారూ పేసర్ల ధాటికి 36 పరుగులకే ఆలౌటైన భారత్‌కు అవమానకర ఓటమి.. దీనికి తోడు వ్యక్తిగత కారణాలతో రెగ్యులర్ కెప్టెన్ విరాట్ కోహ్లీతో పాటు గాయం కారణంగా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా సిరీస్‌కు దూరమయ్యారు. ఇలాంటి స్థితిలో సారథ్య పగ్గాలు అందుకున్న వారెవరైనా విజయం సంగతి దేవుడెరుగు.. సిరీస్ ముగిస్తే అదే పదివేలు అనుకుంటారు. అదీగాక ఆస్ట్రేలియా గడ్డపై తొలి టెస్టులో ఓడి మళ్లీ సిరీస్‌లో పుంజుకున్న దాఖలాలే




లేవు. కానీ నాయకత్వ పగ్గాలు అందుకున్న రహానే మాత్రం పాత పుస్తకాల దుమ్ముదులుపుతూ నవచరిత్రను లిఖించాడు.

అంతగా అనుభవం లేని జట్టును అతడు ముందుండి నడిపించిన తీరు గురించి ఎంత చెప్పినా తక్కువే. అడిలైడ్ అపజయం తర్వాత రెండో టెస్టు జరిగిన మెల్‌బోర్న్‌లో సారథిగా సెంచరీ (122) చేసి తన జట్టుకు స్ఫూర్తినిస్తూ టీమిండియా విజయానికి బాటలు వేశాడు. మూడో టెస్టు డ్రా. గబ్బాలో నాలుగో టెస్ట్. హేజిల్‌వుడ్, కమిన్స్, స్టార్క్ త్రయం.. భారత బ్యాటర్ల తలలను లక్ష్యంగా చేసుకుని సందిస్తున్న బౌన్సర్లను పుజారాతో తట్టుకుని జట్టుకు ధైర్యం నూరిపోయడంలో రహానేది కీలకపాత్ర.

అప్పటికీ అంతర్జాతీయ అనుభవం లేని సిరాజ్, శార్దూల్, నటరాజన్, వాషింగ్టన్, పంత్, గిల్ వంటి యువకులతో ఆసీస్‌కు ముచ్చెమటలు పట్టించి సిరీస్‌ను చేజిక్కించుకోవడంలో కీలకంగా వ్యవహరించాడు. యువ జట్టుతో ఇంతటి గొప్ప విజయాన్ని సాధించినా గబ్బాలో నిర్వహించిన సెలబ్రేషన్స్‌లో పంత్‌కు జాతీయ జెండాను అప్పగించి తాను రెండో వరుసలోకి వెళ్లిపోయి నిలుచోవడం రహానే నాయకత్వ లక్షణానికి మరో ఉదాహరణ. టెస్టుల్లో అతడు 6 మ్యాచ్‌లకు సారథిగా ఉంటే ఓటమన్నదే లేకుండా నాలుగింట్లో గెలిచి రెండింటిని డ్రా చేసుకున్నాడు.

**విదేశాల్లో ఫుల్ సక్సెస్**
రహానే స్వదేశంలోకంటే విదేశాల్లోనే ఎక్కువ విజయవంతమయ్యాడు. రహానే తన టెస్టు కెరీర్‌లో 5,077 రన్స్ చేయగా అందులో విదేశీ పిచ్‌లపై 51 టెస్టులు ఆడి 39.43 సగటుతో 3,234 రన్స్ సాధించడం గమనార్హం. తన కెరీర్‌లో 12 శతకాలు సాధిస్తే అందులో 8 విదేశాల్లో చేసినవే. రహానే.. చివరిసారి 2023లో వెస్టిండీస్‌తో సిరీస్‌లో భారత్‌కు ప్రాతినిథ్యం వహించాడు.

**రోకో నీడలో గుర్తింపు రాక..**
గవాస్కర్, వెంగ్‌సర్కార్, సచిన్ వంటి దిగ్గజ క్రికెటర్లు వచ్చిన ముంబై నుంచే తన ప్రస్థానాన్ని ప్రారంభించిన రహానేకు రావాల్సినంత గుర్తింపు రాలేదని కాదనలేని సత్యం. రహానే ఆడిన కాలంలోనే భారత స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ తమ బ్యాటింగ్ విన్యాసాలతో సచిన్ తర్వాత భారత బ్యాటింగ్ లైనప్‌కు కర్త, కర్మ, క్రియ అయ్యారు. మీడియా సైతం వీరి చుట్టే తిరిగింది. టెస్టుల్లో వీరికి తోడు పుజారా.. ద్రవిడ్‌ను మరిపిస్తూ 'నయా వాల్'గా గుర్తింపు పొందాడు.

కానీ రహానే మాత్రం ఎన్నడూ గుర్తింపు కోసం పాకులాడలేదు. స్టార్‌గా ఎదిగినా దేశవాళీల్లో తనను తాను సానబెట్టుకుంటూ యువ ఆటగాళ్లకు ఆదర్శంగా నిలిచాడు. తన పని అయిపోయిందన్నప్పుడల్లా తానెంటో నిరూపించుకున్నాడు. తన ఆటపై ఎన్ని విమర్శలు వచ్చినా సైలెంట్‌గా తన పని తాను చేసుకుంటూ నిస్వార్థ సేవకుడిగా జట్టుకు సేవలందించిన రహానే.. తన కెరీర్‌నూ హంగూ ఆర్భాటాలు లేకుండా అంతే నిశ్శబ్దంగా ముగించడం కొసమెరుపు!

## కాషాయంలోకి హాకీ జెర్సీ..
## హెచ్ఐపై విమర్శల వెల్లువ




**ఢిల్లీ:**
భారత హాకీ జట్టు ఆటగాళ్లు ధరించే జెర్సీ రంగు మారింది. సంప్రదాయక నీలం రంగును కాదని వచ్చే నెలలో నెదర్లాండ్స్, బెల్జియంలో జరుగబోయే హాకీ ప్రపంచకప్ కోసం హాకీ ఇండియా (హెచ్ఐ) విడుదల చేసిన జెర్సీ కాషాయం రంగులోకి మారడం కొత్త వివాదానికి తెరలేపింది. దీనిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఆటను ఎంతగానో ప్రేమించే ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'భారత హాకీ జట్టు జెర్సీని కాషాయంలోకి మార్చారని తెలియగానే నేనెంతగానో ఆవేదన చెందాను. నీలం రంగు జెర్సీ అనేది ఒక కలర్ మాత్రమే కాదు. అది దేశ ప్రతిష్టకు ప్రతీక.దేశ క్రీడా వారసత్వంతో ముడిపడిన ఒక భావోద్వేగం. దశాబ్దాలుగా ఈ రంగు మన ఆశలో, విజయాల్లో, అపజయాల్లో, క్రీడా నైపుణ్యాన్ని సాధించే క్రమంలో మనందరినీ ఏకం చేసింది. బ్లూ కలర్ జెర్సీతో మన జట్లు ఒలింపిక్ వంటి విశ్వక్రీడా యవనికపై మువ్వన్నెల జెండాను రెపరెపలాడించాయి. ఒడిశాలో బీజేపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఏకైక పని ఇదే' అని ఆయన విమర్శలు గుప్పించారు. భారత హాకీ మాజీ సారథి వీరెన్ రస్కిన్హా సైతం ఈ చర్యపై అసంతృప్తి వ్యక్తం చేశాడు. రంగు మార్పుపై విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ హెచ్ఐ మాత్రం తమ చర్యను సమర్థించుకోవడం గమనార్హం.




## నవ్వుతో కట్టిపడేస్తున్న ప్రగ్యా జైశ్వాల్..

కంచె, అఖండ, అఖండ 2, డాకు మహారాజ్ సినిమాలతో తెలుగులోమంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది ప్రగ్యా జైశ్వాల్. ఈ జబల్ పూర్ బ్యూటీ నెట్టింట యాక్టివ్‌గా ఉంటూ ఫాలోవర్లలో జోష్ నింపుతుంటుంది. సోషల్ మీడియాలో తనకు సంబంధించిన అప్‌డేట్స్‌ను షేర్ చేసుకునే ప్రగ్యాజైశ్వాల్ తాజాగా పోస్ట్ చేసిన ఫొటోలు కుర్రకారుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.ప్రగ్యాజైశ్వాల్ సెలబ్రిటీ, ఫ్యాషన్ స్టైలిష్ట్ నటాషా బోత్రా అండ్ టీం డిజైన్ చేసిన ట్రెండీ కాస్ట్యూమ్స్‌లో హొయలు పోయింది. బ్లూ అండ్ వైట్ చారలతో డిజైన్ చేసిన డ్రెస్‌లో చిరునవ్వులు చిందిస్తూ కెమెరాకు ఫోజులిచ్చింది. ఈ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. 'చారలు తిరిగి వచ్చాయని విన్నా..' అంటూ ఈ స్టిల్స్‌కు క్యాప్షన్ ఇచ్చింది. చూసేందుకు రెండు కళ్లు చాలవన్నట్టుగా ఉన్న ప్రగ్యాజైశ్వాల్ స్టిల్స్ ఇప్పుడు నెట్టింట ట్రెండింగ్ అవుతున్నాయి. ప్రస్తుతం బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న టైసన్ నాయుడులో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది ప్రగ్యాజైశ్వాల్.

# అఖిల్ కెరీర్‌లో ఫస్ట్ బ్లాక్‌బస్టర్..

## రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన 'లెనిన్'!



టాలీవుడ్ యువ సామ్రాట్ అఖిల్ అక్కినేని కెరీర్‌లో ఓ సరికొత్త చరిత్రాత్మక అధ్యాయం మొదలైంది. ఆయన నటించిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ లెనిన్ చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతాలు సృష్టిస్తూ, ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్ల మైలురాయిని విజయవంతంగా అధిగమించింది. దీంతో అఖిల్ కెరీర్‌లో తొలి బ్లాక్ బస్టర్‌ను నమోదు చేయడంతో పాటు తొలి రూ.100 కోట్ల సినిమాగా రికార్డులకెక్కింది. జూలై 10న భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా, తొలి ఆట నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుని బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించింది.దర్శకుడు మురళి కిషోర్ అబ్బూరు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ముఖ్యంగా సినిమాలో అఖిల్ కొత్త మేకోవర్, పవర్ ప్యాక్డ్ మాస్ యాక్షన్ సీక్వెన్స్‌లు, హై-ఓల్టేజ్ ఎమోషనల్ సన్నివేశాలు థియేటర్లలో ప్రేక్షకులను కట్టిపడేశాయి. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ సంయుక్తంగా అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని నిర్మించాయి. నిర్మాత నాగవంశీ, నాగార్జున అనుసరించిన పబ్లిసిటీ వ్యూహాలు సినిమా విజయంలో కీలక పాత్ర పోషించాయి. ఇక తమ అభిమాన హీరో అఖిల్ ఖాతాలో తొలి బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ హిట్ పడటంతో అక్కినేని అభిమానులు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు. సినిమా విజయాన్ని పురస్కరించుకుని చిత్ర యూనిట్ కూడా సంతోషం వ్యక్తం చేస్తూ ప్రేక్షకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# 'రామాయణ' ట్రైలర్ విడుదల..

## అద్భుతమైన విజువల్స్‌తో గూస్‌బంప్స్,రావణుడిగా యష్ అదుర్స్!



భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పాన్-వరల్డ్ ప్రాజెక్ట్ 'రామాయణ' ఎట్టకేలకు అభిమానుల ముందుకు తన మొదటి ట్రైలర్‌ను తీసుకొచ్చింది. గత రెండేళ్లుగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ విజువల్ ఎపిక్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ట్రైలర్ విడుదల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రేక్షకులకు మేకర్స్ జూలై 30 తెల్లవారుజామున బ్రహ్మ ముహూర్తంలో అన్ని ప్రధాన భారతీయ భాషల్లో ట్రైలర్‌ను విడుదల చేసి సర్‌ప్రైజ్ ఇచ్చారు. భారీ బడ్జెట్‌తో, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిన ఈ చిత్రం విజువల్ పరంగా కొత్త ప్రమాణాలను సృష్టించేలా కనిపిస్తోంది. సుమారు రూ.2,000 నుంచి రూ.3,000 కోట్ల వ్యయంతో రూపొందుతున్న ఈ చిత్రానికి ప్రపంచ స్థాయి టెక్నీషియన్లు పనిచేస్తుండటంతో, హాలీవుడ్ స్థాయి విజువల్ అనుభూతిని ప్రేక్షకులకు అందించాలనే లక్ష్యంతో మేకర్స్ ముందుకెళ్తున్నారు.సుమారు 4 నిమిషాల 10 సెకన్ల నిడివితో విడుదలైన ట్రైలర్ ప్రారంభం నుంచే ఆసక్తిని పెంచుతుంది. రావణుడు, ఇంద్రుడి మధ్య జరిగే భీకర యుద్ధ సన్నివేశాలతో మొదలైన ట్రైలర్‌లో, జనక మహారాజు యజ్ఞం, శ్రీరాముడి జననం, ఆయన పరాక్రమం, విశ్వామిత్రునితో ప్రయాణం, వనవాసం వంటి కీలక ఘట్టాలను అద్భుతమైన విజువల్స్‌తో చూపించారు. ప్రతి ఫ్రేమ్‌లోనూ భారీదనం కనిపిస్తుండగా, విజువల్ ఎఫెక్ట్స్, సినిమాటోగ్రఫీ, యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పించేలా ఉన్నాయి. హాలీవుడ్ చిత్రాలకు ఏమాత్రం తీసిపోని స్థాయిలో గ్రాఫిక్స్ రూపొందించినట్లు ట్రైలర్ స్పష్టమైన సంకేతాలు ఇస్తోంది. ఈ చిత్రంలో రణబీర్ కపూర్ శ్రీరాముడి పాత్రలో కనిపిస్తుండగా, సాయి పల్లవి సీతగా నటించారు. అయితే ట్రైలర్‌లో అందరి దృష్టిని ఎక్కువగా ఆకర్షించిన పాత్ర మాత్రం యష్ పోషించిన రావణుడిదే. శక్తివంతమైన లుక్, ప్రభావవంతమైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆయన పాత్ర ట్రైలర్‌కు ప్రత్యేక హైలైట్‌గా నిలిచింది.ఇక సన్నీ డియోల్ హనుమంతుడి పాత్రలో నటిస్తున్నప్పటికీ, ట్రైలర్‌లో ఆయన పాత్రను పూర్తిగా రివీల్ చేయకుండా మేకర్స్ సస్పెన్స్ కొనసాగించారు. దీంతో పూర్తి సినిమాలో హనుమంతుడి పాత్ర ఎలా ఉండబోతుందనే ఆసక్తి మరింత పెరిగింది. ట్రైలర్‌కు నేపథ్య సంగీతం కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంతర్జాతీయ సంగీత దిగ్గజం హాన్స్ జిమ్మర్‌తో పాటు ఏ.ఆర్. రెహమాన్ అందించిన సంగీతం ప్రతి సన్నివేశాన్ని మరింత ఎలివేట్ చేసింది. భారీ యుద్ధ ఘట్టాలు, భావోద్వేగ సన్నివేశాలు, విజువల్ ప్రెజెంటేషన్‌కు తగ్గట్టుగా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రేక్షకులను మరో ప్రపంచంలోకి తీసుకెళ్లేలా ఉంది. ఈ ఏడాది దీపావళి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా తొలి భాగాన్ని విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు .



# 4వ తరగతి వరకు బర్త్‌డే తెలియదు ..

## ధనుష్ మాటలపై నెటిజన్ల విమర్శలు!

కోలీవుడ్ స్టార్ హీరో, పాన్ ఇండియా నటుడు ధనుష్ మరోసారి సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారారు. ఇటీవల తన 43వ పుట్టినరోజు సందర్భంగా చెన్నైలో అభిమానులు నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న ధనుష్, తన చిన్ననాటి జీవితానికి సంబంధించిన కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. అయితే ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తున్నాయి. కొందరు అభిమానులు ఆయన నిజాయితీని మెచ్చుకుంటుండగా, మరికొందరు మాత్రం ఇదే తరహా భావోద్వేగ కథలను పదేపదే చెబుతున్నారంటూ విమర్శలు గుప్పిస్తున్నారు.పుట్టినరోజు వేడుకల్లో మాట్లాడిన ధనుష్.. జూలై 28 అనేది తనకు ఇప్పుడు ప్రత్యేకమైన రోజు అయినప్పటికీ, చిన్నప్పుడు మాత్రం తన పుట్టినరోజు ఎప్పుడో కూడా తెలియదని చెప్పారు. నాలుగో తరగతి వరకు తన జన్మదినం గురించి తనకు అవగాహన లేదని, ఒకసారి స్కూల్‌లో ఇతర విద్యార్థులు రంగురంగుల దుస్తులు వేసుకుని చాక్లెట్లు పంచుతుండటం చూసి తానూ అలానే చేయాలనిపించిందని వివరించారు.అప్పుడు తన అక్కను అడగగా, ఆమె తల్లిదండ్రులను అడిగి జూలై 28 తన పుట్టినరోజు అని చెప్పిందని తెలిపారు. ఆ తర్వాత ప్రత్యేకంగా ఒక కలర్ డ్రెస్, కొన్ని చాక్లెట్లు కొనిపించమని ఇంట్లో ఒప్పించి స్కూల్‌కు తీసుకెళ్లి పంచానని ధనుష్ చెప్పుకొచ్చారు. ఆ రోజుల్లో దీపావళి, పొంగల్ వంటి పండుగలకు మాత్రమే కొత్త బట్టలు కొనేవారని, అలాంటి పరిస్థితుల్లో చిన్న కోరిక కూడా ఎంతో ప్రత్యేకంగా అనిపించేదని పేర్కొన్నారు. ధనుష్ వ్యాఖ్యలపై నెటిజన్లు గతంలో ఆయన చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ విమర్శలు చేశారు. 'ఇడ్లీ కడై' సినిమా ప్రమోషన్ల సమయంలో తాము చిన్నప్పుడు ఇడ్లీ కొనడానికి కూడా డబ్బులు లేక పువ్వులు అమ్మేవాళ్లమని చెప్పిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఇప్పుడు మరోసారి పేదరికం గురించి మాట్లాడటం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రతి సినిమా ప్రమోషన్‌కి ఒక కొత్త ఎమోషనల్ స్టోరీ చెప్పడం అవసరమా?, ప్రేక్షకుల సానుభూతి కోసం ఇలాంటి కథలు చెబుతున్నారా? అంటూ కొందరు కామెంట్లు చేస్తున్నారు. ప్రముఖ దర్శకుడు కస్తూరి రాజా కుమారుడైన ధనుష్ తరచూ పేదరికం గురించి మాట్లాడటంపై కూడా సోషల్ మీడియాలో చర్చ సాగుతోంది.

# పరిణతితో ఆలోచిస్తున్నా!



శృతిహాసన్ నటిగా మారి 17ఏండ్లయింది. సోహన్‌షా దర్శకత్వంలో 2009లో వచ్చిన బాలీవుడ్ సినిమా 'లక్' నటిగా ఆమె తొలి సినిమా. ఆ తర్వాత అదే ఏడాది తెలుగులో 'అనగనగా ఒక ధీరుడు'లో నటించారు శృతిహాసన్. రెండూ పెద్దగా ఆడలేదు. తెలుగులో వచ్చిన 'గబ్బర్‌సింగ్' ఆమెకు తొలి హిట్. ఇక అప్పట్నుంచి వెనక్కు తిరిగి చూసుకునే అవసరం రాలేదు శృతిహాసన్‌కి.నటిగా, సంగీత దర్శకురాలిగా, గాయనిగా వెండితెరపై బహుముఖ ప్రజ్ఞ చాటుతూ తండ్రికి తగ్గ తనయ అనిపించుకున్నారామె. విజయ్‌సేతుపతితో ఆమె నటించిన 'ట్రైన్' చిత్రం త్వరలో విడుదల కానున్నది. ఈ సందర్భంగా జరిగిన ఓ భేటీలో ఆమె మాట్లాడుతూ 'సినిమాని మాత్రమే కాదు.. మనుషులని, మనసులని, వ్యక్తిత్వాలని సైతం అర్థం చేసుకునే పరిణతిని ఈ 17ఏండ్ల ప్రయాణం నాకిచ్చింది.వాశీబ్ష్ట్రాంఋఅం ఢ ణఋంజూశీతీఋఇప్పుడు నేను ఎలాంటి విమర్శలనైనా ఎదుర్కొనగలను. ఆ మానసిక ధృఢత్వాన్ని కూడా ఈ 17ఏండ్ల ప్రయాణమే ఇచ్చింది. ఇండస్ట్రీలోకి రాకముందు సినిమా విజయంలో నటుల పాత్రే కీలకం అనుకునేదాన్ని. కానీ ఆ విజయం వెనుక 24 శాఖల కష్టం ఎంత ఉందో నటిని అయ్యాక అర్థమైంది' అన్నారు శృతిహాసన్.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465